ఫిబ్రవరి 16న ఐక్య ఆందోళన

- రైతులు, కార్మికుల దేశవ్యాప్త ప్రదర్శనలు, పికెటింగ్‌లు, రైల్ రోకో, జైలు భరో
- కార్పొరేట్, మతోన్మాద విద్వేష, విభజన విధానాలపై ప్రతిఘటన
- ఎస్‌కెఎం, కేంద్ర కార్మిక సంఘాలు ఉమ్మడి వేదిక పిలుపు

7

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 153 | విజయవాడ, శనివారం 6 జనవరి 2024 | 8 + 8 పేజీలు | వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 6 January 2024 | Rs



సిటీ ◆

ఎన్నికల ఢంకా మోగిస్తున్న చంద్రబాబు

కదం తొక్కిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు



ధర్నా చౌక్‌లో జరిగిన ఆందోళనలో పాల్గొన్న ఎస్ఎస్ఏ సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎంఎల్‌సి ఐవి

-వార్త లోపలి పేజీల్లో..

విచక్షణ పేరుతో ఏకపక్షం కుదరదు

గవర్నర్ అధికారంపై సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : ఎలాంటి శాఖ కేటాయించకుండా మంత్రిగా వి.సెంథిల్ బాలాజీని కొనసాగించడంపై నిర్ణయించుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌దేనంటూ ఈ విషయంపై తాను ఎలాంటి ఆదేశాలు జారీ చేయకుండా, బంతిని ముఖ్యమంత్రి కోర్టులోకే నెడుతూ మద్రాసు హైకోర్టు తీసుకున్న వైఖరి సరైనదేనని సుప్రీం కోర్టు శుక్రవారం పేర్కొంది. ఉద్యోగం కోసం ముడుపులు కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసు మంత్రి సెంథిల్ బాలాజీపై నమోదైంది. "ఆదేశాలు సరైనవే.. మద్రాసు హైకోర్టు తీసుకున్న నిర్ణయంతో మేం ఏకీభవిస్తున్నాం. ఎలాంటి జోక్యం అవసరం లేదు. పిటిషన్ డిస్మిస్ చేయబడింది." అని బెంచ్‌కు నేతృత్వం వహిస్తున్న జస్టిస్ ఎఎస్ ఓఖా పిటిషనర్ ఎం.ఎల్ రవిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సెంథిల్

మిగతా 2లో

అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తా!

25 లక్షల ఉద్యోగాలిస్తా

తెలుగుజాతిని నంబర్ 1 చేస్తా

కనిగిరి సభలో టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి- కనిగిరి, ఒంగోలు బ్యూరో

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినవెంటనే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ప్రకాశం జిల్లా కనిగిరిలోని వెలుగొండ సాధన ప్రాంగణంలో శుక్రవారం 'రా...కదిలిరా..' పేరుతో సభను నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ సంకల్ప బలం, అనుభవంతో తెలుగు జాతిని ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెడతానన్నారు. దీనికి ఐదు కోట్ల రాష్ట్ర ప్రజల ఆశీర్వాదం, సహకారం కావాలని కోరారు. జగన్ ప్రభుత్వం నిరుద్యోగుల ఆశలను నీరుగారుస్తోందన్నారు. అధికారంలో వచ్చిన వెంటనే 25 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. జాతీయ స్థాయిలో జరిగిన ఒక సర్వే

మిగతా 2లో

మరో నౌక హైజాక్‌కు యత్నం

- తక్షణమే స్పందించిన భారత నేవీ
- 15మంది భారతీయులతో సహా 21 మంది సిబ్బంది సురక్షితం

లోపలి పేజీలో..

కంపుకొడుతున్న బస్తీలు

- పేరుకుపోతున్న చెత్త
- పరిష్కారం కోసం చొరవ చూపని సర్కార్

అర్హులందరికీ మరో అవకాశం




అర్హులైన లబ్ధిదారులకు చెక్కును పంపిణీ చేస్తున్న సిఎం జగన్

- సంక్షేమ పథకాల విడుదలలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి
- ఆరునెలలకోసారి సమీక్ష
- 1.11 లక్షల మందికి బియ్యం కార్డులు

లోపలి పేజీలో..

సమస్యలు పరిష్కరించకుంటే దేశవ్యాప్త ఉద్యమం



విజయవాడ ధర్నా చౌక్‌లో చేపట్టిన అంగన్‌వాడీల దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సింధు

-వార్త లోపలి పేజీల్లో..

భారతి సిమెంట్స్‌కు ఎదురుదెబ్బ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

భారతి సిమెంట్స్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. జగన్ అక్రమాస్తుల కేసులో భారతీ సిమెంట్స్ ఎఫ్‌డిలపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం ధర్మాసనం తోసిపుచ్చింది. భారతి సిమెంట్స్‌కు చెందిన రూ.150 కోట్ల ఎఫ్‌డిలను ఇడి విడుదల చేయాలంటూ హైకోర్టు గతంలో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సుప్రీంలో ఇడి సవాల్ చేసింది. ఇడి వాదనలతో ఏకీభవిస్తూ జస్టిస్ అభయ్ ఓకా నేతృత్వంలోని ధర్మాసనం తీర్పునిచ్చింది. భారతి సిమెంట్స్ ఎఫ్‌డిల స్థానంలో బ్యాంకు గ్యారంటీలు పొంది ఎఫ్‌డిలను విడుదల చేయాలన్న తీర్పును పున:పరిశీలించాలని హైకోర్టుకు సుప్రీం ఆదేశాలు జారీ చేసింది.

15వ ఆర్థిక సంఘం కింద రూ.వెయ్యి కోట్లు

- సర్పంచు సంఘాల నేతలతో మమతా వర్మ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన కేంద్ర నిధులు రూ.1,000 కోట్లు విడుదల చేసి ఎపి ప్రభుత్వానికి కూడా పంపామని కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ సంయుక్త కార్యదర్శి మమతా వర్మ తెలిపారు. శుక్రవారం నాడిక్కడ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయంలో మమతా వర్మను అఖిలభారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావు కలిశారు. 2023 -24 ఆర్థిక సంవత్సరంలో కూడా రావాల్సి ఉన్న బకాయిలను విడుదల చేయాలని వినతిపత్రం అందజేశారు. 2023-24 వార్షిక సంవత్సరానికి సంబంధించిన నిధులను కేంద్ర ఆర్థికశాఖకు రికమండ్ చేస్తామని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు వచ్చిన తరువాత ఆ నిధులను కూడా విడుదల చేస్తామని మమతా వర్మ తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ఆర్-5 జోన్‌పై కేసుల విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అమరావతి ఆర్-5 జోన్ వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు ఏప్రిల్‌కు వాయిదా వేసింది. వెంటనే జోక్యం చేసుకుని విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి చేసిన అభ్యర్థనను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సెంటు భూమి ఇచ్చి నివాస గృహాలు నిర్మించేందుకు చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారని అభిషేక్ మను సింఘ్వి వాదించారు. రాజధానికి సంబంధించిన ప్రధాన పిటిషన్ ఇదే ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉందని రైతుల తరపున సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ ధర్మాసనానికి తెలిపారు. దీనిపై స్పందిస్తూ.. ఏం జరుగుతుందో తమకు అన్ని తెలుసని జస్టిస్ సంజీవ్ ఖన్నా అన్నారు. సింఘ్వి విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. కేసు విచారణ ఏప్రిల్‌లో నాన్ మిస్లేనియస్ డే రోజు తుది విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టం చేసింది.

సమస్యలు పరిష్కరించకుంటే దేశవ్యాప్త ఉద్యమం

- ఎఆర్ సింధు హెచ్చరిక
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు కోర్టు ధిక్కరణే
- ప్రారంభమైన 24 గంటల రిలే దీక్షలు
- రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల మద్దతు



విజయవాడ ధర్నా చౌక్‌లోని 24 గంటల దీక్షా శిబిరంలో నిద్రిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - విజయవాడ, గుంటూరు

అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కొనసాగితే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరిస్తామని ఆల్ ఇండియా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ఎఆర్ సింధు హెచ్చరించారు. అంగన్‌వాడీల సమ్మె 24వ రోజుకు చేరిన సందర్భంగా 24 గంటల రిలేదీక్షలను విజయవాడలో శుక్రవారం ఆమె ప్రారంభించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సిఐటియు), ఎఐటియుసి, ఐఎఫ్‌టియుకు చెందిన ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల నేతలు, కార్యకర్తలు తొలిరోజు దీక్షల్లో పాల్గొన్నారు. వీరికి పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించిన అనంతరం సింధు మాట్లాడుతూ అంగన్‌వాడీల సంక్షేమం కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్రంలోని మోడీ, ఆంధ్రప్రదేశ్‌లోని సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయడం లేదన్నారు. ఇది కోర్టు ధిక్కరణే అవుతుందని తెలిపారు. అంగన్‌వాడీల సమ్మె పట్ల రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులు, దాడులు, కేసులు వంటి వాటిని మానుకుని, తక్షణమే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆ దిశలో చర్యలు తీసుకోకుండా ప్రభుత్వ వైఖరి ఇదే మాదిరి కొనసాగితే అన్ని రాష్ట్రాల్లోనూ నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయకపోవడం సరికాదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులుగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఉన్నారని తెలిపారు. పౌష్టికాహార లోపంతో ప్రతి రోజు 29 వేల మంది పిల్లలు మృత్యువాతపడుతున్నట్లు ప్రభుత్వ లెక్కలే చెప్తున్నాయన్నారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఐసిడిఎస్ సంస్థకు దేశంలో పది కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారని, కేంద్ర ప్రభుత్వం వీరికి కేవలం రూ.20 వేల కోట్లు మాత్రమే ఏడాదికి కేటాయించడం అత్యంత దారుణమన్నారు. దేశంలోని 15 నుంచి 20 మంది కార్పొరేట్ కంపెనీలకు మాత్రం రూ.మూడు నుంచి ఐదు లక్షల కోట్ల వరకు పన్ను రాయితీలు ఇస్తున్నారని తెలిపారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు మాట్లాడుతూ నిర్బంధాలకు, అరెస్టులకు, కేసులకు అంగన్‌వాడీలు భయపడే వారు కాదని అన్నారు.. అంగన్‌వాడీల ఉద్యమానికి అండగా సిఐటియు, ఎఐటియుసి, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ఇతర కార్మిక సంఘాలు సంపూర్ణ మద్దతునిస్తున్నాయని తెలిపారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ అంగన్‌వాడీల ఉద్యమానికి ఎఐటియుసి, ఇతర కార్మిక సంఘాలు అండగా ఉన్నాయన్నారు. ఐఎఫ్‌టియు నాయకులు రవిచంద్ర మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం అవుతుందని, జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీలు తప్పక విజయం సాధిస్తారని, వారి పోరాటానికి గ్రామ స్థాయి నుంచి మద్దతు కూడగడుతున్నామని అన్నారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన సమ్మెకు పిడిఎఫ్ ఎమ్మెల్సీల తరుపున మద్దతు ప్రకటించారు. దీక్షల్లో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కె సుబ్బరావమ్మ, నాయకులు ఎం.నాగశేషు, జి.చీమరాణి, టి.గజలక్ష్మి, యల్లారాణి, సైలజ, ఎ.రమాదేవి, బి.రజీనారాణి, శైలజ, లతకుమారి, కుమారి, మల్లేశ్వరి, నాగలక్ష్మి, జె లలితమ్మ, ప్రేమ, హెల్డ్, ఆర్ కృష్ణేనమ్మ, జె గంగావతి, శోభ తదితరులు కూర్చున్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబిరాణి అధ్యక్షత వహించారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని ఎఆర్.సింధు, రాష్ట్ర అధ్యక్షులు బేబిరాణి, రాష్ట్ర కార్యదర్శి రోజా సందర్శించి మద్దతు తెలిపారు. ఈ నెల 5వ తేదీలోగా విధుల్లో చేరకపోతే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని అంగన్‌వాడీలకు అధికారులు జారీ చేసిన నోటీసులను ఈ శిబిరం వద్ద దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సింధు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అంగన్‌వాడీలకు యూనిఫైడ్ సర్వీసు రూల్స్ తీసుకురావాలని, కనీస వేతనాలు, సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు.



కేసు నుండి విముక్తి పొందిన ప్రజా సంఘాల నేతలు

ప్రజాసంఘాల నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి - విజయవాడ

అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని 2015లో విజయవాడలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద ధర్నా చేసిన నేతలపై పెట్టిన కేసును కోర్టు శుక్రవారం కొట్టివేసింది. అప్పటి టిడిపి ప్రభుత్వం అంగన్‌వాడీలతోపాటు వారికి మద్దతు తెలిపిన ప్రజాసంఘాల నాయకులపై అక్రమంగా కేసులు పెట్టింది. దీనికి సంబంధించి 680/16 కేసులోని సాక్షులను విచారించిన విజయవాడ 3వ అదనపు ఎంఎం కోర్టు న్యాయమూర్తి ఈ కేసును కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో సిఐటియు, కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం తదితర ప్రజాసంఘాల నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ప్రజా సంఘాల కార్యకర్తలపై ప్రభుత్వం పెట్టిన అనేక అక్రమ కేసులు ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా ఉద్యమాలపై తీవ్ర నిర్బంధాన్నిఆపాలని కోరారు.

సంక్రాంతికి 6,795 ప్రత్యేక బస్సులు

- సాధారణ చార్జీలతోనే ఆర్‌టిసి ప్రయాణం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రానున్న సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో వుంచుకొని ప్రయాణీకుల కోసం ఎపిఎస్ ఆర్‌టిసి మొత్తం 6,795 ప్రత్యేక బస్సులను నడుపనుంది. స్పెషల్ బస్సులలో ఎలాంటి అధనపు చార్జీలను వసూలు చేయకుండా సాధారణ చార్జీలతోనే నడపాలని నిర్ణయించారు. సంక్రాంతికి ముందురోజులో హైదరాబాద్‌కు 1,600 బస్సులు, బెంగుళూరుకు 250, చెన్నయ్‌కు 40, విజయవాడకు 400, విశాఖపట్నానికి 290, రాజమండ్రికి 230, తిరుపతికి 70 బస్సులను వేశారు. అలాగే పండుగ తర్వాత 3,225 బస్సులను నడిపేందుకు ఆర్‌టిసి కార్యచరణ రూపొందించుకున్నట్లు ఎపిఎస్ ఆర్‌టిసి ఒక ప్రకటన విడుదల చేసింది.

వేతనాలు జమచేయకపోవడం శోచనీయం

- విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ సంస్థల్లోని ఉద్యోగులకు డిసెంబరు వేతనాలు 5వ తేదీ వచ్చినా యాజమాన్యాలు జమచేయకపోవడం శోచనీయమని ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ పేర్కొంది. వెంటనే వేతనాలు చెల్లించాలని కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి సుదర్శన్‌రెడ్డి, వెన్నపూస సుబ్బిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ అంశంపై విద్యుత్ యాజమాన్యాలకు వినతిపత్రాలు పంపినట్లు వెల్లడించారు. వరుస పండగలు ఉన్న సమయంలో వేతనాలు అందకపోవడంతో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర నిరాశ చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ అవసరాల నిమిత్తం బ్యాంకు నుంచి పొందిన రుణాలకు ఇఎంఐ వాయిదాలు చెల్లింపు ఆలస్యం కావడంతో అపరాధ రుసుం చెల్లించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్హులందరికీ మరో అవకాశం

- సంక్షేమ పథకాల విడుదలలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి
- ఆరునెలలకోసారి సమీక్ష
- 1.11 లక్షల మందికి బియ్యం కార్డులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి మరో అవకాశం కల్పిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆగస్టు 2023 నుండి డిసెంబరు వరకు అర్హులైన వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు రూ.97.76 కోట్లను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయం నుండి శుక్రవారం బటన్‌నొక్కడం ద్వారా వారి ఖాతాల్లో జమచేశారు.

ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ అర్హులకు పథకం అందకపోతే నెలరోజుల తరువాత వారితో మరలా దరఖాస్తు పెట్టించి ఆరునెలల్లోపు వారికి లబ్ధి అందజేయాలన్నారు. దరఖాస్తులోపం వల్లే అధార్ తో అనుసంధానం కాకుండా ఆగిన వారందరికీ అందచేస్తామన్నారు. 2021 నుండి ఐదు పర్యాయాల్లో అర్హత ఉండి పొరపాటున మిస్ అయిన లబ్ధిదారులకు రూ.1700 కోట్లు ఇప్పటివరకు అందచేసినట్లు తెలిపారు. ఇప్పుడు కొత్తగా 68,990 మందికి రూ.98 కోట్లు లబ్ధి కల్పిస్తున్నామని చెప్పారు. అమ్మఒడి కింద మిస్ అయిన వారిలో 40,616 మందికి కూడా డబ్బులు అందజేస్తున్నామని పేర్కొన్నారు. జగనన్న చేదోడు, ఇబిసి నేస్తం, వాహనమిత్ర, మత్స్యకార భరోసా, కళ్యాణమస్తు, షాదీతోఫా, కాపునేస్తం, నేతన్ననేస్తం వంటి పథకాల్లో మిగిలిపోయిన వారికి నేడు అందించామని తెలిపారు.

ఈ నెల నుండి 1,11,321 మందికి కొత్త రేషన్‌కార్డులు అందిస్తున్నామని వివరించారు. మరోవైపు 6,314 మందికి కొత్త ఆరోగ్యశ్రీకార్డులు, 34,623 మందికి ఇళ్లస్థలాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ నుండి సచివాలయ సిబ్బంది వరకూ ఎవరూ మిగిలిపోకుండా చూసే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్, సిఎస్ జవహర్‌రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అనంతరాము, అజేయ్‌జైన్, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శులు ప్రవీణ్‌ప్రకాష్, సునీత తదితరులు పాల్గొన్నారు.

కంపుకొడుతున్న బస్తీలు

- పేరుకుపోతున్న చెత్త
- పరిష్కారం కోసం చొరవ చూపని సర్కార్

ప్రజాశక్తి - యంత్రాంగం

స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో స్వచ్ఛతే కరువైంది. బస్తీల్లో ఎటు చూస్తే అటు పేరుకుపోయిన చెత్త కుప్పలు. ముక్కుపుటాలు అదిరిపోయే దుర్గంధం, చెత్త కుండీలు నిండిపోయి రోడ్డుపై చెల్లా చెదురుగా పడి ఉన్న చెతను పందులు, వీధికుక్కలు మరింత చిందరవందర చేస్తుండడంతో ఆ దారిలో వెళ్లాలంటేనే భయమేస్తోంది. దోమల బెడద సరేసరి. ఇది రాష్ట్రంలో ఎక్కడో ఉన్న బస్తీల సంగతి కాదు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి నివాసానికి కూత వేటు దూరంలో ఉండే చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల పరిస్థితి. ఇక్కడే ఇటువంటి పరిస్థితి ఉంటే, రాష్ట్రంలో మిగతా ప్రాంతాల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. . ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే అంటు వ్యాధులు విజృంభించి రాష్ట్రం రోగాంధ్రప్రదేశ్‌గా మారే ప్రమాదముందని, కరోనా మళ్లీ తలెత్తుతున్న స్థితిలో ఇది విపత్కర పరిణామాలకు దారి తీసే ప్రమాదముందని ప్రజారోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిసెంబరు26 నుంచి మున్సిపల్ వర్కర్స్ చేస్తున్న సమ్మెను పరిష్కరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. అందునా సంక్రాంతి పండగ దగ్గర పడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం బెట్టు వీడి సమ్మెను పరిష్కరిస్తే మంచిదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరుతున్నారు. పన్నెండు రోజులుగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నా వారి ప్రధానమైన డిమాండ్లను అంగీకరించకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నది. సమ్మెను విఫలం చేసేందుకు పోటీ కార్మికులు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రంగంలోకి దింపాలని చూసింది. పోటీ కార్మికులు కూడా సమ్మెకు దిగారు. టన్నులకొలది పోగుపడుతున్న చెత్త ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువెత్తు దర్పణం పడుతున్నాయి.

గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థ (జివిఎంసి) పరిధిలో ప్రతి రోజూ 845 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతోంది. సమ్మె ప్రారంభమైన నాటి నుంచి దాదాపు 2,500 టన్నులు చెత్త పోగయింది. దీనిలో 1,200 టన్నుల చెత్తను మాత్రమే అధికారులు తొలగించగలిగారు. జివిఎంసి పరిధిలో 990 మంది పర్మినెంట్, 4,900 అవుట్ సోర్సింగ్ కార్మికులు ఉన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులందరూ సమ్మెలో ఉన్నారు. పర్మినెంట్ కార్మికులతో అధికారులు చెత్తను తీయిస్తున్నారు.

గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ప్రతి రోజూ 800 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుంది. 300 మంది పర్మినెంట్ కార్మికులు ఉన్నారు. ప్రస్తుతం 110 నుంచి 150 మెట్రిక్ టన్నుల చెత్త మాత్రమే సేకరణ జరుగుతోంది.

అనంతపురం కార్పొరేషన్ పరిధిలో ప్రతి రోజూ 120 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతోంది. పర్మినెంట్ కార్మికుల ద్వారా ప్రసుత్తం 25 మెట్రిక్ టన్నుల చెత్త మాత్రమే సేకరణ జరుగుతోంది

విజయనగరంలో 480 మంది కార్మికులు సమ్మెలో ఉండటంతో ఎక్కడి చెత్త అక్కడే పోగుపడుతోంది. మరోవైపు కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో మురికి నీరు ప్రధాన వీధుల్లోకి ప్రవహిస్తున్నాయి. నగరంలోని 50 డివిజన్లలో ఇదే పరిస్థితి నెలకొంది.

ఒంగోలు నగరంలో ఇంటింటికి చెత్త సేకరణ కార్యక్రమం మూడు, నాలుగు రోజులకోసారి జరుగుతోంది. మిగతా మున్సిపాలిటీల్లోనూ కాలనీల్లో, బ్లాక్ పాయింట్ల వద్ద చెత్త కుప్పలుకుప్పలుగా పేరుకుపోయింది. డ్రెయినేజీ శుభ్రత పూర్తిగా నిలిచిపోయింది. దోమల ఉధృతి పెరిగింది. ఇళ్లల్లో చెత్త సేకరణ నిలిచిపోవడంతో ప్రజలు కూడా మున్సిపల్ కార్మికుల సమ్మె గురించి చర్చించుకుంటున్నారు. కార్మికులు ఎప్పుడు విధుల్లోకి వస్తారని వాకబు చేస్తున్నారు.

శ్రీకాకుళం జిల్లా పలాస కాశీబుగ్గ కెటి రోడ్డుతో పాటు వార్డుల్లో చెత్తా పేరుకుపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తడి చెత్తా, పొడి చెత్తా ఒకే ప్రాంతంలో పారవేయడంతో దుర్వాసన భరించలేక పోతున్నామని పట్టణ ప్రజలు, మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్ఛాపురంలో రెగ్యులర్ ఉద్యోగులతో అరకొర పారిశుధ్య పనులు పడుతున్నా కాలనీల్లో చెత్త కుప్పలు తెప్పలుగా పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. అనంతపురం నగర పాలక సంస్థతోపాటు ఆరు మున్సిపాలిటీలు ఐదు నగర పంచాయతీల్లోని ప్రతి వీధుల్లోనూ చెత్త పేరుకుపోయింది. ఇంజనీరింగ్ కార్మికులు కూడా జిల్లాలో సమ్మెలో ఉండటంతో ప్రధాన వీధుల్లో తప్ప తక్కిన చోట్ల రాత్రి సమయాల్లో వీధి లైట్లు కూడా వెలగడం లేదు.

ఏలూరు కార్పొరేషన్‌లో ఏ వీధి చూసినా చెత్తతో నిండిపోయింది. ప్రతి ఇంటివద్ద చెత్తడబ్బాలు నిండిపోయాయి. రహదారులపైనే చెత్త పడేస్తున్నారు. విశాఖ నగరంలోని పూర్ణామార్కెట్, జగదాంబ, ఎంవిపి.కాలనీ, కెఆర్ఎం.కాలనీ, జాలారిపేట, గాజువాక, మధురవాడ, మల్కాపురం, కంచరపాలెం, గోపాలపట్నం వంటి ప్రాంతాల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం అక్కడక్కడా ప్రయివేటు వ్యక్తులను పెట్టి చెత్త తరలింపు పనులు చేయిస్తున్నా నగరం మొత్తం కంపుకొడుతోంది.



విశాఖ ఎంవిపి.కాలనీలోని ఓ వీధిలో పేరుకుపోయిన చెత్తాచెదారం

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కార్మికుల సమ్మెతో డ్రెయిన్లలో సిల్టును తీసేవారు కరువయ్యారు. మరో రెండు రోజులు ఇలాగే ఉంటే వీధుల్లోకి మురుగునీరు ప్రవహించే ప్రమాదం ఉంది. కాకినాడ జిల్లా సామర్లకోట, పెద్దాపురంలో కార్మికుల సమ్మెతో పారిశుధ్యం పనులు చాలా వరకూ నిలిచిపోయాయి. మెయిన్ రోడ్డులను మాత్రం పర్మినెంట్ కార్మికులు శుభ్రం చేస్తున్నారు. వార్డుల్లోకి శానిటేషన్ సిబ్బంది రాకపోవడంతో చెత్తకుండీలు నిండిపోయాయి.

తిరుపతి జిల్లా గూడూరు మున్సిపాలిటీ కంపు కొడుతోంది. చెత్తను తొలగిస్తున్నట్లు మున్సిపల్ కౌన్సిలర్స్ ఫొటోకు ఫోజులివ్వడమే తప్ప కార్మికుల సమస్యలను మాత్రం పరిష్కరించడం లేదు. అధికార మెప్పుకోసం పోటీ కార్మికులతో పనులు చేయిస్తూ..అడ్డుకుంటున్న వారిపై బైండోవర్ కేసులు పెడుతున్నారు. ఉమ్మడి కడప, కర్నూలు, కృష్ణాలోని ప్రధాన పట్టణాలు చెత్తతో పేరుకుపోయాయి. వీధులన్నీ దుర్వాసనలు వెదజల్లుతున్నాయి.

మహబూబ్‌నగర్‌లో ఘోర ప్రమాదం

- ఆటోను ఢీకొట్టిన డిసిఎం
- ఆరుగురు గిరిజనులు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తండావాసులతో వెళ్తున్న ఆటోను డిసిఎం ఢీకొట్టింది. సంతలో కూరగాయలు, నిత్యావసర వస్తువులు కొనుక్కుని ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కిన ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. బాలానగర్‌లో వారాంతపు సంతకు చుట్టుపక్కల తండాల నుంచి ప్రజలు నిత్యావసర వస్తువులు, కూరగాయల కోసం వచ్చారు. ఈ క్రమంలో సాయంత్రం పలువురు తిరిగి ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కారు. బాలానగర్ బస్టాండ్ కూడలి సమీపంలో ఆటో రోడ్డు క్రాస్ చేస్తుండగా.. హైదరాబాద్ నుంచి వేగంగా వచ్చిన డిసిఎం ఢీకొట్టింది. ఆటోలో ఉన్న ఇద్దరు చిన్నారులు సహా ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. అదే సమయంలో ఆటో బైక్‌పై పడటంతో.. పలువురికి గాయాలయ్యాయి. మృతులు మేడిగడ్డ తండా, నందారం, బిబినగర్ తండావాసులుగా గుర్తించారు. ప్రమాదానికి కారణమైన డిసిఎంకు వారు నిప్పు పెట్టడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటనతో 44వ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. స్థానికులు జాతీయ రహదారిపై ధర్నా చేశారు.

పర్యావరణాన్ని రాజకీయ అజెండాగా మార్చాలి

- గ్రీన్ మేనిఫెస్టో సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మానవ మనుగడకు ముప్పుగా మారుతున్న కాలుష్య కారకాలను నియంత్రించేలా రాజకీయ పార్టీలు రానున్న ఎన్నికల్లో పర్యావరణాన్ని రాజకీయ అజెండాగా పెట్టుకునేలా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. విజయవాడలోని సిద్ధార్థ లా కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సంయుక్తంగా గ్రీన్ మేనిఫెస్టోపై సదస్సును శుక్రవారం నిర్వహించాయి. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ప్రతినిధి దివాకర్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రొఫెసర్ డి నరసింహారెడ్డి మాట్లాడారు. పర్యావరణంపై ప్రపంచ వ్యాప్తంగా 28 ఏళ్లుగా ఆందోళనలు జరుగుతుంటే మన దేశంలో ప్రభుత్వాలకే కాదు రాజకీయ పార్టీలు కూడా కనీస స్పృహ లేకుండా వ్యవహరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి అంశం ప్రకృతితో ముడిపడి వుంటుందని ప్రతియేటా జులైలో వచ్చే రుతుపవనాలు కొద్దిగా ఆలస్యమైతే స్టాక్ మార్కెట్ పడిపోతుందన్నారు. అయినా ప్రభుత్వాలు గానీ, కార్పొరేట్ సంస్థలు గానీ ప్రకృతిని పట్టించుకోకపోవడం బాధ్యతారాహిత్యం కాదా? అని ప్రశ్నించారు. ప్రొఫెసర్ పురుషోత్తమరెడ్డి మాట్లాడుతూ.. సహజ వనరులు, పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. భోపాల్ దుర్ఘటనలో 4 వేల మంది మృతి చెందితే యాజమాన్యంపై చర్యలు తీసుకోవాల్సిన ముఖ్యమంత్రులు యూనియన్ కార్బయిడ్ అధినేత అండర్సన్‌తో సమీక్షలు చేయడం సిగ్గుచేటన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వెంకట్రావు మాట్లాడుతూ.. ఇప్పటికే ఆర్కిటిక్ ప్రాంతంలో, హిమాలయాల్లో మంచుకరిగి విధ్వంసం జరుగుతున్నా.. ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణ కోసం చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. 2030 నాటికి మరింత ఉష్ణోగ్రతలు పెరుగుతాయని శాస్త్రవేత్తలు హెచ్చరికలు చేస్తున్నా.. ఉద్గారాలను తగ్గించేందుకు ఎవరూ చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదన్నారు. ప్రజలు కూడా ప్రత్యామ్నాయ ఇంధనాలను ప్రోత్సహించాలని కోరారు. ప్రభుత్వాలు కూడా ప్రజా రవాణాను ప్రోత్సహించాల్సిన అవసరం వుందన్నారు. ఉత్పత్తి, వినిమయంపై దృష్టి సారించాలన్నారు.

అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తా!

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం ఒకప్పుడు ఎక్కువ ఉద్యోగాలు పొందే రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ నేడు నిరుద్యోగాంధ్రప్రదేశ్ గా మారిందని విమర్శించారు. జాబు రావాలంటే బాబు కావాలనే పరిస్థితికి ప్రజలు వచ్చారన్నారు. తాను కియా కార్ల కంపెనీ తీసుకొస్తే... జగన్ మాఫియా తీసుకొచ్చారని, తాను నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తే జగన్ గంజాయి ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వం కుంభకోణాల్లో కూరుకుపోయిందని, ఇసుక మద్యం దోపిడీతో ప్రజల రక్తాన్ని తాగుతూ ప్రజాధనం తాడేపల్లి లోని జగన్ ఇంటికి చేరుతోందని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే నిత్యావసర ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చారు.కనిగిరి ప్రాంత ప్రజల నీటి కష్టాలు తెలుసని, తాను శ్రీకారం చుట్టిన వెలుగొండ ప్రాజెక్టుని అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పూర్తి చేసి పశ్చిమ ప్రకాశం అందులోని కనిగిరిని సస్యశ్యామలం చేస్తామన్నారు. రాష్ట్రానికి పట్టిన అరిష్టాన్ని తొలగేలా సైకిల్ పాలన వచ్చేలా ప్రజలు ఆదరించాలని కోరారు. గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్రంలోని ప్రజలందరూ నరకం అనుభవిస్తున్నారని, ఈ నూతన సంవత్సరం అందరికీ మంచి జరగాలని ఆశించారు. జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. ప్రకాశం జిల్లా పౌరుషాల గడ్డ అని బ్రిటీష్ వారి తుపాకీ గుండుకు రొమ్ము విరిచి చూపిన ప్రకాశం పంతులు పుట్టిన గడ్డ అని.. అందుకే ఈ గడ్డ నుంచి ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తున్నట్లు తెలిపారు. నాడు ఎన్‌టిఆర్ 'రా.. కదిలిరా..' అని పిలుపునిస్తే ప్రభంజనమైందని, నేడు రాష్ట్రాన్ని కాపాడేందుకు 'రా.. కదలిరా..' అని తాను, పవన్ కల్యాణ్ సమిష్టిగా పిలుపునిస్తే ప్రజలు హర్షిస్తూ అండగా నిలిచేందుకు కదిలి వస్తున్నారని అన్నారు. ఉద్యోగుల్లాగా ప్రజాప్రతినిధులను ట్రాన్స్‌ఫర్ చేయడం ఏమిటని, ఈ వైసిపి ప్రభుత్వంలోనే చూస్తున్నామని విమర్శించారు. ఎమ్మెల్యేలను ఎంపిలను ఒక చోట నుంచి మరోచోటికి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారని, ఒక ఇంటిలో పనికిరాని చెత్తను మరో ఇంటిలో వేస్తే ప్రజలు ఆదరిస్తారా అని పేర్కొన్నారు. వంద రోజులు యువత కష్టపడి సైకిల్ పాలన తీసుకువచ్చేందుకు కృషి చేస్తే వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తానని హామీ ఇచ్చారు.

విచక్షణ పేరుతో ఏకపక్షం కుదరదు

(మొదటిపేజీ తరువాయి)

బాలాజీని ప్రభుత్వంలో కొనసాగించేందుకు గల అవకాశాలపై నిర్ణయం తీసుకోవాల్సిందిగా ముఖ్యమంత్రిని హైకోర్టు కోరింది. "పోర్టుఫోలియో లేకుండా ఒక మంత్రిని ప్రభుత్వంలో కొనసాగించడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే... రాజకీయ ఒత్తిళ్ళు అనేవి ప్రజల నైతికత, సుపరిపాలన లేదా స్వచ్ఛమైన పాలన, రాజ్యాంగ నైతికత ప్రమాణాల కన్నా ఎక్కువేమీ కాదు." అని వ్యాఖ్యానించింది. మంత్రిని ఏకపక్షంగా డిస్మిస్ చేసే విచక్షణాధికారం గవర్నర్‌కి లేదని హైకోర్టు చేసిన వ్యాఖ్యలతో జస్టిస్ ఓఖా కూడా ఏకీభవించారు. ఒక మంత్రికి సంబంధించి తాను సంతృప్తి చెందడం లేదని గవర్నర్ భావించినట్లైతే, ముందుగా ముఖ్యమంత్రిని సంప్రదించాకే తన విచక్షణాధికారాలను ఉపయోగించు కోవాలి. అంతేకానీ ఏకపక్షంగా చేయరాదు. ప్రస్తుత కేసులో, ముఖ్యమంత్రి సమ్మతిని తీసుకునే ప్రయత్నం గవర్నర్ ఎన్నడూ చేయలేదు" అని మద్రాసు హైకోర్టు తన సెప్టెంబరు 5 నాటి ఉత్తర్వుల్లో పేర్కొంది. తొలుత సెంథిల్ బాలాజీని విద్యుత్, ఎక్సైజ్ శాఖ మంత్రిగా తొలగిస్తూ తక్షణమే అమల్లోకి వచ్చేలా గతేడాది జూన్ 29న ఆదేశాలు జారీ చేసిన గవర్నర్ కొద్ది గంటల వ్యవధిలోనే మొదట జారీ చేసిన ఆదేశాలను నిలుపు చేస్తూ రెండోసారి ఆదేశాలు జారీ చేశారు. గవర్నర్ ఆదేశాలను రవి సవాలు చేశారు. మంత్రి తొలగింపును నిలుపుచేస్తూ గవర్నర్ తీసుకున్న నిర్ణయం ఏకపక్షమని, రాజ్యాంగాన్ని తీవ్రంగా ఉల్లంఘించడమేనని రవి పేర్కొన్నారు. "గవర్నర్‌గా బాధ్యతలు నిర్వరిస్తున్న ఆయన తన ఆదేశాలను వెనక్కి తీసుకోలేరు. మంత్రిని తొలగించాలంటూ ఆదేశించడానికి బదులుగా హైకోర్టు కేవలం మంత్రి విషయంలో నిర్ణయం తీసుకోవాలంటూ మాత్రమే ముఖ్యమంత్రికి సూచించింది." అని పిటిషనర్ తన పిటిషన్‌లో వాదించారు. సెంథిల్ బాలాజీ శాఖలను ఆర్థిక మంత్రి తంగమ్ తెన్నరసుకి బదలాయిస్తూ, బాలాజీని పోర్టుఫోలియో లేని మంత్రిగా కొనసాగించాలని కోరుతూ ముఖ్యమంత్రి, గవర్నర్‌కు గతేడాది జూన్ 16న లేఖ రాయడంతో ఈ ప్రహసనం ఆరంభమైంది. అదే రోజు గవర్నర్ తెన్నరసుకి శాఖలను బదలాయించారు. కానీ సెంథిల్ బాలాజీ క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను ఎదుర్కొంటున్నందున మంత్రిగా కొనసాగించడాన్ని వ్యతిరేకించారు. అదే రోజు సెంథిల్ బాలాజీ శాఖలు వేరే వారికి కేటాయించబడ్డాయని, ఆయన ఎలాంటి పోర్టుఫోలియో లేకుండా మంత్రిగా కొనసాగుతారంటూ రాష్ట్ర ప్రభుత్వం ఒక పత్రికా ప్రకటన జారీ చేసింది. దీంతో గవర్నర్ జూన్ 29న మంత్రి బాలాజీని తొలగిస్తూ తొలుత ఆదేశాలు జారీ చేయడం, ఆ వెంటనే వాటిని నిలుపుచేస్తూ రెండోసారి ఆదేశాలు జారీ చేయడం జరిగాయి.

104(2) సెక్షన్ రద్దు చేయండి : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రమాదాలు జరిగినపుడు డ్రైవర్లను శిక్షార్హులను చేస్తూ భారతీయ న్యాయ సంహిత చట్టంలోని సెక్షన్ 104(2) చట్ట సవరణను రద్దు చేయాలని ఎపిపిటిడి ఎస్‌డబ్ల్యుఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా, అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, కె అయ్యపరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా రవాణా రంగం డ్రైవర్ల కొరతను ఎదుర్కొంటోందని తెలిపారు. తక్షణం ఈ చట్ట సవరణను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

హామీల అమలు ఏదీ?

- ఎన్‌ఎంయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలపై యాజమాన్యం తరపున ఇచ్చిన హామీల అమలు కావడం లేదని, తక్షణం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎపిపిటిడి ఎన్‌ఎంయు కోరింది. ఈ మేరకు ఎన్‌ఎంయు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పివి రమణారెడ్డి, వై శ్రీనివాసరావు శుక్రవారం ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు వినతిపత్రం అందజేశారు. తమ సంఘం తరపున డిసెంబరు 4న వినతిపత్రం ఇస్తే నెల రోజుల్లోపు సమస్యలను పరిష్కరిస్తామని హామీ కానీ అమలు చేయలేదని అన్నారు. ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 8న అన్ని జిల్లా కేంద్రాలు, రెవెన్యూ డివిజనల్ కేంద్రాలు, తహశీల్దారు కార్యాలయాల్లో వినతిపత్రాలు ఇచ్చి నిరసనల ద్వారా ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

14 ఏళ్లలో చంద్రబాబు ఏం చేశారు?

- మాజీ మంత్రి పేర్ని నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా వుండి ప్రజలకు, రాష్ట్రానికి ఏం చేశారో చంద్రబాబు నాయుడు చెప్పాలని మాజీ మంత్రి పేర్ని నాని డిమాండ్ చేశారు. తను చేసింది చెప్పకుండా ప్రతి సభలో సిఎం జగన్‌ను తిట్టడమే అజెండాగా పెట్టుకోవడం తగదని అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్‌కు జగన్‌ను దూషించడమే అజెండాగా మారిపోయిందని విమర్శించారు. 2014కు ముందు ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

9న' అనంత 'తెలుగు భాషా వైభవ సదస్సు : విజయ్‌బాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అనంతపురంలో ఈనెల 9న అనంత తెలుగు బాషా వైభవ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు పి. విజయ్‌బాబు తెలిపారు. విజయవాడ ఇరిగేషన్ కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ సదస్సులో తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన 90మందిని సన్మానిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలందరూ ఈ సదస్సుకు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. పాలనావసరాల కోసం తెలుగు భాషా సంస్కృతుల పరిపుష్టికి భాషాసంఘం పాటు పడుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు రచయితలు, కవి పండితులు, సాహితీ మూర్తుల వివరాలను అధికారం భాషా సంఘం అధ్యక్షుల పర్సనల్ సెక్రటరీ బిట్టు రమేష్, ఫోన్ నెంబర్ 8801811782, అడిషనల్ పర్సనల్ సెక్రటరీ వి.రఘుకుమార్ ఫోన్ నెంబరు 7989499978కు వాట్సాప్ ద్వారా లేక ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం మెయిల్ olcommissionap@gmail.com కు పంపాలని విజయ్‌భాబు తెలిపారు. ఈ సమావేశంలో బాషా సంఘం సభ్యులు ఆచార్య రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించకుంటే 20 తర్వాత సమ్మె

- సిసిఎల్‌ఎ ధర్నాలో విఆర్‌ఎ సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి అంజి



ధర్నాలో మాట్లాడుతున్న కమిషనర్ ఇంతియాజ్

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

విఆర్‌ఎల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఈ నెల 20వ తేదీ తర్వాత సమ్మె చేస్తామని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి అంజి అన్నారు. మంగళగిరి సిసిఎల్‌ఎ కార్యాలయం ఎదుట గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి శతవిధాల పోలీసులు ప్రయత్నించారు. చివరకు ధర్నా చేసి వినతిపత్రం అందజేయడానికి ఒప్పుకున్నారు. ఈ ధర్నాను ఉద్దేశించి అంజి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు అధికారంలోకి వచ్చిన వెంటనే వారంలోపు విఆర్‌ఎల సమస్యలన్నిటిని పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని, నేటికీ ఏ సమస్యలూ పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. 2023 సెప్టెంబర్‌లో ధర్నా చేసినప్పుడు డిఎ రూ.500 వేతనంతో కలిపి ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని అన్నారు. నామినీలకు ప్రమోషన్లు ఇవ్వలేదన్నారు. గతంలో 10వ తరగతి ఉండగా, ప్రస్తుతం ఇంటర్మీడియట్, డిగ్రీ క్వాలిఫికేషన్ పెట్టారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం లాగా పేస్కేలు అమలు చేస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదని తెలిపారు. విఆర్‌ఎలకు వాచ్‌మెన్, విఆర్‌ఒ, అటెండర్ పోస్టులు 70 శాతం పెంచి ఎన్నికలలోపు ఖాళీగా ఉన్న విఆర్‌ఒ, అటెండర్ పోస్టులను సీనియార్టీ పద్ధతిలో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నిటిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కారం చేయకపోతే ఈ నెల 20వ తేదీ తర్వాత సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. అనంతరం భూ పరిపాలన అధికారి ఎఎండి ఇంతియాజ్‌కు సిసిఎల్‌ఎ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో ఇంతియాజ్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని, ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. ఇప్పటికే కొన్ని సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు జెవి రాఘవులు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ఎం బాలాజీ, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు బంది, త్రినాథ్, రవి, రమేష్, నాగేంద్రం, ఆంజనేయులు, సుబ్బయ్య, ప్రసాద్, వెంకటరమణ, రహిమాన్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున ఖర్గేతో షర్మిల భేటీ

- బాధ్యతలు అప్పగింతపై చర్చలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేతో వైఎస్ షర్మిల భేటీ అయ్యారు. గురువారం కాంగ్రెస్‌లో చేరిన షర్మిల, శుక్రవారం మల్లికార్జున ఖర్గేను కలిశారు. ఈ సమావేశంలో ఎపి వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాగూర్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. అనంతరం వైఎస్ షర్మిల మీడియాతో మాట్లాడుతూ.. తనకు బాధ్యతలు అప్పగించే అంశంపై చర్చలు జరుగుతున్నాయని, ఒకట్రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని అన్నారు. తనకు ఏ బాధ్యతలు ఇచ్చినా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. అంతకుముందు కాంగ్రెస్ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌ను కూడా షర్మిల కలిశారు.

మృతుల కుటుంబాలకు టిడిపి భరోసా

- 'నిజం గెలవాలి' యాత్రలో నారా భువనేశ్వరి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, సీతమ్మధార, గాజువాక విలేకరులు

మృతుల కుటుంబాలకు టిడిపి అండగా ఉంటుందని ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి భరోసా ఇచ్చారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా శుక్రవారం విశాఖ దక్షిణం, ఉత్తర, గాజువాక నియోజకవర్గాల్లో ఆమె పర్యటించారు. విశాఖలో ఎక్కడికక్కడ టిడిపి కార్యకర్తలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబును జైలులో పెట్టిన విషయం తెలిసి గుండె ఆగిపోయి మృతి చెందిన వారి కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించారు. కుటుంబ పెద్దలను కోల్పోయి శోక సంద్రంలో మునిగిన కుటుంబాలు అధైర్యపడొద్దని, అందరికీ తామున్నామని భరోసానిచ్చారు. దక్షిణ నియోజకవర్గం 33వ వార్డులోని టిడిపి కార్యకర్త జాగరపు చిన్నా (47) కుటుంబాన్ని, 41వ వార్డులోని మలిశెట్టి రమణ (55) కుటుంబాన్ని పరామర్శించారు. రమణ కుమారుడు రాజు, కోడలు సంతోషి, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఉత్తర నియోజకవర్గంలోని 45వ వార్డులో పంచిరెడ్డి కనకారావు (52) కుటుంబాన్ని పరామర్శించారు. కనకారావు భార్య పార్వతి, కుమార్తె ఉదయశ్రీ, కుమారుడు శ్యామ్‌లను ఓదార్చారు. గాజువాక 65వ వార్డులోని కోరుకొండ వెంకట రమణ (61) కుటుంబాన్ని, 69వ వార్డులోని పమిడిముక్కల రాధాకృష్ణమూర్తి కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.3 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. అనంతరం విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాద్ వెళ్లారు.

1.11 లక్షల రేషన్ కార్డులు మంజూరు

- పౌర సరఫరాలశాఖ కమిషనరు అరుణ్‌కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ద్వైవార్షిక పథకంలో భాగంగా అర్హులై ఉండి పలు కారణాలతో రేషన్‌కార్డులు పొందలేకపోయిన వారికి ప్రభుత్వం 1,11,321 కార్డులను మంజూరు చేసిందని పౌర సరఫరాలశాఖ కమిషనరు హెచ్ అరుణ్‌కుమార్ తెలిపారు. కొత్త కార్డుల వల్ల 2,59,687 మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. నూతనంగా కార్డులు మంజూరైన లబ్ధిదారులందరూ కొత్త రేషన్‌కార్డు, కార్డు విభజన కోసం 2023 ఆగస్టు నుంచి డిసెంబరు వరకు దరకాస్తు చేసుకున్న వారేనన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 1.48 కోట్ల కార్డుదారులకు ప్రతినెలా బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తుందన్నారు. కొత్తగా మంజూరు చేసిన రేషన్‌కార్డు దారులందరికీ జనవరి నెల నుంచే బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ ఉంటుందన్నారు.

జిల్లాలవారీ కొత్తగా మంజూరైన కార్డులు

అల్లూరి సీతారామరాజు 2,333 కార్డులు, అనకాపల్లి 3,375, అనంతపురం 5,708, అన్నమయ్య 4,075, బాపట్ల 3,038, చిత్తూరు 3,991, తూర్పుగోదావరి 4,891, ఏలూరు 4,538, గుంటూరు 3,958, కడప 4,897, కాకినాడ 4,434, అంబేద్కర్ కోనసీమ 4,348, కృష్ణా 3,540, కర్నూలు 6,657, మన్యం 2,050, నంద్యాల 4,540, నెల్లూరు 5,266, ఎన్‌టిఆర్ 4,289, పల్నాడు 4,129, ప్రకాశం 5,162, శ్రీకాకుళం 4,945, శ్రీసత్యసాయి 4,869, తిరుపతి 4,078, విశాఖపట్నం 3,055, విజయనగరం 4,254, పశ్చిమగోదావరి 4,901 రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది.

వివేకా కూతురు సునీత పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

పులివెందుల కోర్టు ఉత్తర్వుల తర్వాత తమపై పులివెందుల పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ మాజీ మంత్రి వైఎస్ వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, సిబిఐ అధికారి రాంసింగ్ వేర్వేరుగా వేసిన పిటిషన్లను శుక్రవారం హైకోర్టు విచారణ జరిపింది. ఎఫ్‌ఐఆర్‌తోపాటు చార్జిషీట్‌ను కొట్టేయాలంటూ సవరణ పిటిషన్లను అనుమతించింది. ఈ నెల 10న విచారణ జరపుతామని జస్టిస్ బి శ్రీభానుమతి ప్రకటించారు. ఆ ముగ్గురూ తనను మానసికంగా వేధించారంటూ వివేకా పిఎ కృష్ణారెడ్డి పులివెందుల కోర్టులో ఫిర్యాదు చేయడంతో దీనిపై విచారణ చేయాలని పోలీసులను ఆ కోర్టు ఆదేశించింది. దీనిపై పోలీసులు పెట్టిన కేసులను కొట్టేయాలంటూ ఆ ముగ్గురూ హైకోర్టును ఆశ్రయించారు. చార్జిషీట్ కూడా దాఖలైన తర్వాత పోలీసుల కేసు కొట్టేయాలనే పిటిషన్‌కు విచారణార్హత ఉండదని పోలీసుల వాదన తర్వాత హైకోర్టు పిటిషన్లను సవరించాలని ఆదేశించింది.

రాష్ట్రానికి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు : గంధం చంద్రుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో జాతీయ స్థాయి పురస్కారాలు అందుకోవడం ద్వారా రాష్ట్రం మరోసారి సత్తా చాటిందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి గంధం చంద్రుడు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా నిర్వహించే అతిపెద్ద పారిశుధ్య సర్వేలో దేశంలోనే అత్యుత్తమ నగరాలుగా గ్రేటర్ విశాఖ, విజయవాడ, తిరుపతి, గుంటూరు నగరపాలక సంస్థలు 2023 సంవత్సరానికి జాతీయ స్థాయిలో అవార్డులు దక్కించుకున్నాయన్నారు. పులివెందుల పురపాలక సంఘం రాష్ట్ర స్థాయిలో అవార్డులు కైవసం చేసుకుందన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ 2021, 2022, 2023లో వరుసగా ఇండియా క్లీనెస్ట్ సిటీ, క్లీన్ స్టేట్ క్యాపిటల్, జాతీయ అవార్డులను పొందిందన్నారు. విశాఖ నగరం 2021 నుంచి 2023 వరకు వరుసగా బెస్ట్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్, క్లీన్ బిగ్ సిటీ, జాతీయ అవార్డు సాధించిందన్నారు. తిరుపతి టౌన్ బెస్ట్ స్మాల్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్‌బ్యాక్ (2021), సఫాయి మిత్ర సురక్షిత్ ప్రెసిడెంట్ అవార్డు (2022), జాతీయ అవార్డు (2023) దక్కించుకుందన్నారు. పుంగనూరు పురపాలక సంఘం 2021, 2022లో బెస్ట్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ అవార్డులను, పులివెందుల 2022లో ఇన్నోవేషన్, బెస్ట్ ప్రాక్టీస్ అవార్డును, 2023లో స్టేట్ అవార్డులను దక్కించుకున్నాయన్నారు.

దోపిడిని చట్టబద్ధం చేసేందుకే

- 'భూ హక్కుల' చట్టంపై పవన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జగన్ దోచుకున్న ఆస్తులను చట్టబద్ధం చేసుకునేందుకే ఎపి భూ యాజమాన్య హక్కుల చట్టం (టైట్లింగ్ యాక్ట్) తీసుకొచ్చారని జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ ఆరోపించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టంతో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. ప్రజలకు రక్షణ ఇవ్వని భూ యాజమాన్యహక్కుల చట్టంలోని లోగుట్టుని అందరికీ అర్థమయ్యేలా చెప్పి చైతన్యం చేస్తామన్నారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో శుక్రవారం న్యాయవాదులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమైనారు. ఈ సందర్భంగా భూ యాజమాన్యపు హక్కుచట్టంలోని లోపాలను న్యాయవాదులు పవన్‌కల్యాణ్‌కు వివరించారు. ఈ సమావేశంలో పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, న్యాయవాదులు పార్టీ లీగల్‌సెల్ ఛైర్మన్ ఈవన సాంబశివ ప్రతాప్, విజయవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు సోము కృష్ణమూర్తి, గుంటూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పులివెళ్ల వెంకట కోటసురేష్ పాల్గొన్నారు.

తెలుగు భాషకు పూర్వ వైభవం రావాలి

- అంతర్జాతీయ తెలుగు మహాసభ ప్రారంభ సభలో స్వరూపానందేంద్ర

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

తెలుగు భాషకు ఉన్న గొప్పతనం, మాధుర్యం మరేబాషకు లేదని, అటువంటి తెలుగు భాషకు పూర్వ వైభవం రావాలని విశాఖ శారదా పీఠం అధిపతి శ్రీస్వరూపానందేంద్ర స్వామి అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో త్రిదిన అంతర్జాతీయ తెలుగు మహాసభను రాజానగరంలోని గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. శ్రీశ్రీ రాజరాజనరేంద్ర వేదికపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాషలాంటి భాష ఈ సృష్టిలో లేదన్నారు. తెలుగులో గర్వించదగ్గ కవులు ఉన్నారన్నారు. కావ్యాలు, పురాణం ఇతిహాస అనువాదాలు తెలుగువాళ్లు చేసినట్లు ఎవరూ చేయలేదని తెలిపారు. మహా మహోపాధ్యాయ విశ్వనాధ గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడుతూ తెలుగు భాష నేర్చుకుంటే సంస్కారం అలవడుతుందన్నారు. పద్మవిభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ తెలుగునేలను సస్యశ్యామలం చేసిన సర్ ఆర్థర్ కాటన్, తెలుగు నిఘంటువు రూపొందించిన సిపి బ్రౌన్, గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం చిరస్మరణీయులన్నారు. కవి అందెశ్రీ మాట్లాడుతూ.. ప్రాంతం ఏదైనా ఎలుగెత్తి చాటుతున్న నిలువెత్తు సంతకం తెలుగు అని అన్నారు. మాజీ ఎంపి కనుమూరి బాపిరాజు మాట్లాడుతూ తల్లిలాంటి తెలుగు భాషను మరువకూడదన్నారు. మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ.. తమిళ ప్రాంత పాలనలో ఉన్న యానాం నుంచి ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన తాను అసెంబ్లీలో తెలుగులోనే మాట్లాడేవాడినని గుర్తుచేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ కార్యకారి వారణాసి రామ్‌మాధవ్, మాజీ ఎంపి కనుమూరి బాపిరాజు, జెఎన్‌టియుకె విసి ప్రసాదరావు, ఎపి ఫైబర్ నెట్ కార్పొరేషన్ ఛైర్మన్ గౌతమ్ రెడ్డి, పారిశ్రామికవేత్త వర్మ, అష్టావధాని బులుసు అపర్ణ తదితరులు మాట్లాడారు. సభకు ముందు ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం కవులు నన్నయ, వెంగమాంబ, మొల్ల, తిక్కన్న, డొక్కా సీతమ్మ, చిన్నయసూరి, గుర్రం జాషువా, శ్రీపాద కృష్ణమూర్తి, గాయకులు ఘంటసాల, పిబి.శ్రీనివాస్ తదితరుల వారసులు 72 మందిని సత్కరించారు.

ఆసియాలోనే అత్యంత సంపన్నుడిగా అదాని

- రెండో స్థానానికి అంబానీ



న్యూఢిల్లీ : ఆసియాలోనే అత్యంత సంపన్నుడిగా మళ్లీ గౌతం అదాని తొలి స్థానంలోకి వచ్చారు. ఇప్పటి వరకు అగ్రస్థానంలో ఉన్న ముకేష్ అంబానీ రెండో స్థానంలోకి పడిపోయారు. బ్లూమ్‌బర్గ్ గ్లోబల్ బిలియనీర్ ఇండెక్స్ ప్రకారం.. ఒక్క రోజులోనే అదాని సంపద 7.7 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.64వేల కోట్లు) పెరిగి 97.6 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.8.10 లక్షల కోట్లు)చేరింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేష్ అంబానీ సంపద విలువ 97 బిలియన్లు(దాదాపు రూ.8 లక్షల కోట్లు)గా నమోదయ్యింది. అదాని కంపెనీలు కృత్రిమ విలువకు పాల్పడుతున్నాయని.. అనేక ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్నాయని 2023 జనవరిలో హిండన్‌బర్గ్ రిపోర్టు చేయడంతో అదాని కంపెనీల షేర్లు అమాంతం పడిపోయాయి. గతేడాదిలో స్టాక్ మార్కెట్‌లో ఆయన కంపెనీలు దాదాపు 150 బిలియన్ల డాలర్ల (దాదాపు రూ.12 లక్షల కోట్లు)మార్కెట్‌ను ఆయన కోల్పోయాయి. దీంతో బిలియనీర్ల జాబితాలో ఆయన స్థానం అమాంతం పడిపోయింది.

అదాని గ్రూపునపై వచ్చిన ఆరోపణలకు ఆధారాలు లేవని సెబీ తన దర్యాప్తులో పేర్కొనడం.. సుప్రీంకోర్టు కూడా అదే తరహాలో స్పందించడంతో తిరిగి అదాని కంపెనీల స్టాక్స్‌కు మద్దతు లభించింది. విచారణను ప్రత్యేక దర్యాప్తు బందం (సిట్) లేదా సిబిఐకి బదిలీ చేయడానికి నిరాకరించింది. కాగా.. పెండింగ్‌లో ఉన్న రెండు కేసులను మూడు నెలల్లోగా పూర్తి చేయాలని సెబీకి సూచించింది. దీంతో అదానీ గ్రూప్ షేర్లు రెండు రోజులుగా పరుగులు పెట్టాయి. అంతర్జాతీయంగా గౌతం అదాని 12వ స్థానంలో నిలువగా.. ముకేష్ అంబానీ 13వ స్థానంలో ఉన్నారు.

గతేడాది 7,931 యూనిట్ల అమ్మకాలు : ఆడి

న్యూఢిల్లీ : ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ ఆడి 2023లో 89 శాతం వృద్ధితో 7,931 యూనిట్లను విక్రయించినట్లు వెల్లడించింది. 2015 తర్వాత ఇవే అత్యధిక అమ్మకాలని పేర్కొంది. గతేడాది డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 94 శాతం వృద్ధితో 2,401 కార్లను విక్రయించినట్లు తెలిపింది. గతేడాది ఆడి క్యు3 స్పోర్ట్ బ్యాక్, ఆడి క్యు8 ఇ-ట్రాన్, ఆడి క్యు8 స్పోర్ట్ బ్యాక్ ఇ-ట్రాన్ మోడళ్లను ఆవిష్కరించామని ఆడి ఇండియా అధిపతి బల్బీర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు. ఇదే జోరు 2024లోనూ కొనసాగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

కొత్త చెతక్ ఇవి స్కూటర్ ఆవిష్కరణ

న్యూఢిల్లీ : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ బజాజ్ ఆటో శుక్రవారం భారత మార్కెట్లోకి కొత్త వర్షన్ చెతక్ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను విడుదల చేసింది. బ్లూ కలర్‌లో ఫ్రంట్ డిస్క్ బ్రేక్‌తో పాటు పూర్తిగా రెట్రో డిజైన్‌తో దీన్ని ఆవిష్కరించింది. ఈ స్కూటర్ సింగిల్ చార్జింగ్‌తో 127 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలదని బజాజ్ ఆటో తెలిపింది. ఇంతకుముందు మార్కెట్లో ఉన్న బజాజ్ చేతక్ స్కూటర్ 2.88 కిలోవాట్ల బ్యాటరీ, సింగిల్ చార్జింగ్ తో 113 కిలోమీటర్ల దూరం ప్రయాణ సామర్థ్యం కలిగి ఉంది. కొత్త చేతక్ బజాజ్ ఇవి గంటకు 73 కిలో మీటర్ల వేగంతో ప్రయాణించగలదు.

భారత వృద్ధి తగ్గొచ్చు

- ఐక్యరాజ్య సమితి అంచనా

న్యూఢిల్లీ : ప్రస్తు ఏడాది 2024లో భారత్ 6.2 శాతం వృద్ధిని నమోదు చేసే అవకాశాలున్నాయని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. 2023కు అంచనా వేసిన 6.3 శాతం వృద్ధితో పోల్చితే స్వల్పంగా తగ్గనుందని ప్రపంచ ఆర్థిక పరిస్థితి-అవకాశాలు 2024 రిపోర్ట్‌లో పేర్కొంది. ప్రస్తుత ఏడాదికి దేశీయ గిరాకీ, తయారీ, సేవల రంగాల నుంచి మద్దతు లభించనుందని తెలిపింది. భారత్‌లో ప్రభుత్వ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, బహుళజాతి కంపెనీల పెట్టుబడుల్లో వృద్ధి నమోదవుతుందని పేర్కొంది. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల కంటే వర్ధమాన దేశాల్లోనే పెట్టుబడులు బలంగా ఉన్నాయని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. పలు అనిశ్చితి కారణాల వల్ల 2024లో ప్రపంచ వృద్ధి 2.4 శాతానికి తగ్గొచ్చని అంచనా వేసింది. 2023లో 2.7 శాతం వృద్ధిని అంచనా వేసింది.

ఫోన్‌పే సిఇఒగా రితేష్

న్యూఢిల్లీ : ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక ఫోన్‌పే తన ఇంటర్నేషనల్ పేమెంట్స్ బిజినెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ)గా రితేష్ పాయ్‌ను నియమించింది. అంతర్జాతీయ విస్తరణపై దృష్టి కేంద్రీకరించింది. ఇంతక్రితం బ్రిటన్‌కు చెందిన టెర్రాపేలో ప్రాడక్ట్ అండ్ సొల్యూషన్స్ విభాగానికి ప్రెసిడెంట్‌గా పని చేసేవారు. యస్ బ్యాంక్‌లో సీనియర్ గ్రూప్ ప్రెసిడెంట్, చీఫ్ డిజిటల్ ఆఫీసర్‌గా కూడా పని చేసిన అనుభవం ఉంది. రితేష్ తమతో చేరినందుకు సంతోషంగా ఉందని ఫోన్‌పే చీఫ్, వ్యవస్థాపకుడు సమీర్ నిగమ్ పేర్కొన్నారు.



కోలాటమాడుతున్న చిన్నారులు

చదువుతో పాటు ఆట, పాట

- బాలోత్సవంలో ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి- వైఎస్‌ఆర్ ప్రతినిధి

పిల్లల్లో ప్రతిభను వెలికితీసేందుకు బాలోత్సవం తోడ్పడుతోందని వైఎస్‌ఆర్ జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కడప మరియాపురం సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో కడప బాలోత్సవం ప్రథమ పిల్లల పండగ కార్యక్రమాన్ని బాలోత్సవం కమిటీ అధ్యక్షులు జి.గోపాల్, ఉపాధ్యక్షులు డాక్టర్ సి.ఓబుల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ రాహుల్, కార్యదర్శి బి.లక్ష్మీ రాజా ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరగనున్న కార్యక్రమాన్ని తొలిరోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు, పాటలు, మాటలలో మంచి నైపుణ్యం పొందాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి వై.రాఘవరెడ్డి మాట్లాడుతూ.. ఈ సమాజంలో బాల బాలికల హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు. గోపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులలో దాగి ఉన్న సామర్థ్యాలను వెలికి తీయడానికి కడప బాలోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. 43 రకాల యాక్టివిటీస్‌తో అకాడమిక్, నాన్ అకాడమిక్ ముఖ్యంగా జానపద నృత్యం, ఏకపాత్రాభినయం, లఘు నాటిక శాస్త్రీయ నృత్యం, దేశభక్తి గీతాలాపన, వ్యాసరచన పోటీలు లాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలిగించే రీతిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. లక్ష్మీరాజా, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

టిడిపిని బిజెపి బ్లాక్ మెయిల్ చేస్తోంది

- సిపిఐ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చంద్రబాబు అరెస్టు సందర్భంగా 17ఏ చట్టం వర్తింపుపై సుప్రీంకోర్టులో తీర్పు రాకుండా కేంద్రం నిలుపుదల చేసి, దీనిని ఆసరాగా చేసుకుని టిడిపిని బిజెపి బ్లాక్ మెయిల్ చేస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. గుంటూరులోని సిపిఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఆర్థిక నేరాల్లో బెయిల్‌పై ఉన్న సిఎం జగన్‌కు చంద్రబాబును అన్నిరోజులు జైల్లోపెట్టించే శక్తి లేదని, దీని వెనుక కేంద్ర హోం శాఖ సహకారం ఉందని తెలిపారు. తమ అధిష్టానంతో టిడిపి నేతలు మాట్లాడాలని బిజెపి నేత సత్యకుమార్ బెదిరింపు ధోరణితో మాట్లాడటం తగదన్నారు. టిడిపి కూడా సత్యకుమార్ బెదిరింపులపై స్పందించాలని, బిజెపి బ్లాక్ మెయిల్‌కు టిడిపి లొంగకుండా ఆత్మగౌరవంతో నిలబడాలని కోరారు. తెలుగు వారి ఆత్మగౌరవం కోసం పుట్టిన ఆ పార్టీ దాన్ని కాపాడుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా సిఎం జగన్ కనీసం స్పందించడం లేదని విమర్శించారు. జగన్ తన ఎమ్మెల్యేలను బదిలీ చేసే పనిలో ఉన్నారని, ఆందోళనకారులతో మాట్లాడే తీరిక సిఎంకు లేదని ఎద్దేవా చేశారు.



ఘనంగా సౌత్ జోన్ యూత్ ఫెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా 37వ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్ (యూనిఫెస్ట్) 2023-24 ప్రారంభమైంది. ఐదు రోజులపాటు జరిగే ఈ సాంస్కృతిక ఉత్సవంలో పాల్గొనడానికి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళతో పాటు పాండిచ్చేరి నుంచి మొత్తం 23 విశ్వవిద్యాలయాలకు చెందిన 800 మంది విద్యార్థులు హాజరయ్యారు. తొలిరోజు శుక్రవారం సాయంత్రం ఎయు పరిపాలనా భవనం నుంచి సాంస్కృతిక ర్యాలీ ప్రారంభమైంది. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ టెక్నికల్ అబ్జర్వర్ మనీష్ జంగ్రా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ ఎయు పరిపాలనా భవనం నుంచి అమెరికన్ కార్నర్, ఎయు ఇన్ గేట్, ఎయు పాఠశాల, బీచ్‌రోడ్డు మీదుగా ఎయు కన్వెన్షన్ సెంటర్ వరకు సాగింది. విద్యార్థులు తమ సంస్కృతీ సంప్రదాయాలను, కళలను ప్రస్ఫుటం చేస్తూ ప్రత్యేక వస్త్రధారణలో ర్యాలీలో పాల్గొన్నారు. సంగీత వాయిద్యాలకు అనుగుణంగా నర్తించారు. అనంతరం ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. నంది అవార్డు గ్రహీత కె.మహేంద్ర చక్రవర్తి మాట్లాడుతూ.. కళ సమాజ చైతన్యం కోసమన్నారు. తాను ఎయు పూర్వ విద్యార్థినని చెప్పడానికి గర్విస్తానని తెలిపారు.

సంపాదకీయం

భూదోపిడీ చట్టం

రైతుల, ప్రజల ఆస్తి హక్కులకు విఘాతం కలిగించే ఆంధ్రప్రదేశ్ భూ హక్కుల చట్టం (ఎ.పి. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 2023) పీడ విరగడ కాలేదు. చట్టం విషయంలో హైకోర్టులో తాత్కాలిక ఉపశమనమే లభించింది. అది కూడా నెల రోజులే. కాబట్టి భూ హక్కుల చట్టం కత్తి రైతుల, ప్రజల మెడపై వేలాడుతూనే ఉందని గ్రహించి అప్రమత్తం వహించాలి. చట్టం బారి నుంచి శాశ్వత విముక్తి కోసం ప్రజలందరూ పోరాడాలి. ప్రజల హక్కులకు ప్రమాదకరమైన ఎ.పి. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలంటూ ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐలు), మరికొన్ని సంస్థలు, హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాలు వేయగా, విచారణ సందర్భంగా న్యాయస్థానానికి ప్రభుత్వం నివేదించిన అంశాలు చట్టం అమలుపై ముందుకేనని స్పష్టం చేస్తున్నాయి. ఇంకా నిబంధనలు రూపొందించలేదు, ఆస్తుల రిజిస్ట్రేషన్ అధికారులను నియమించలేదు, నోటిఫికేషన్లు ఇవ్వలేదు, కనుక ప్రస్తుతానికి చట్టం అమల్లో లేదు అని సర్కారు తెలిపింది. అంతే తప్ప చట్టంపై ప్రజల, వివిధ తరగతుల నుంచి వెల్లడవుతున్న వ్యతిరేకతను గమనించినట్లుకాని, యాక్ట్‌ను పున:సమీక్షిస్తున్నట్లుకాని చెప్పలేదు. ప్రభుత్వ ఈ వివరణ దృష్ట్యా న్యాయస్థానం వ్యాజ్యాల విచారణను వచ్చే నెల 7కు వాయిదా వేసింది. అప్పటి వరకు సివిల్ కోర్టులు ఆస్తి వివాద వ్యాజ్యాలను తిరస్కరించకుండా విచారించాలని ఆదేశించింది. ప్రభుత్వాన్ని సవివరంగా అఫిడవిట్ దాఖలు చేయమంది. చివరికి న్యాయస్థానం ఏం తీర్పు చెబుతుందో చూడాలి.

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దుర్మార్గమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు కర్త, కర్మ, క్రియ కేంద్ర బిజెపి ప్రభుత్వం. ప్రధాని మోడీ మానస పుత్రిక నీతిఆయోగ్ బుర్రలోనుంచి చట్టం పురుడు పోసుకుంది. దేశ వ్యాప్తంగా ఏకరూప భూహక్కుల చట్టం ఉండాలన్న లక్ష్యం ఇమిడి ఉంది. అందులో భాగంగానే మోడల్ యాక్ట్‌ను తయారు చేసి రాష్ట్రాలకు పంపి ఆమోదించాలని హుకుం జారీ చేసింది. కేంద్రం చెప్పిందే తడవు వైసిపి ప్రభుత్వం 2022 సెప్టెంబర్‌లోనే అసెంబ్లీలో బిల్లు ఆమోదించి రాష్ట్రపతికి పంపగా అక్కడ ఆగమేఘాల మీద ఓకే అయింది. 2023 అక్టోబర్ 31 నుంచి రాష్ట్రంలో చట్టాన్ని అమల్లోకి తెస్తూ జిఓ 572 జారీ అయింది. బాలికలు, మహిళలపై అఘాయిత్యాల నిరోధానికి జగన్ సర్కారు తెచ్చిన 'దిశ' చట్టాన్ని రాష్ట్రపతి, కేంద్రం అనేక కొర్రీలతో ఆమోదించకుండా పలుమార్లు తిప్పి పంపగా, సదరు చట్టం ఇంకా గాలిలో ఉంది. అలాంటిది ప్రజల భూ హక్కులను కాలరాసే ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని మాత్రం రాష్ట్రపతి నుంచి జెట్ స్పీడ్‌లో ఆమోదం లభించిందంటేనే, బిజెపి ప్రాధామ్యాలేమిటో అర్థమవుతుంది.

భూహక్కుల చట్టం గురించి నీతిఆయోగ్ ఉద్దేశాలు ఏమి చెప్పినా అంతిమంగా అదానీ, అంబానీ, కార్పొరేట్లకు ప్రభుత్వ, ప్రైవేటు భూములను అప్పనంగా కట్టబెట్టేందుకే. ప్రణాళికా సంఘం స్థానంలో వచ్చిన నీతిఆయోగ్ చేసే పని అంతర్జాతీయ ఫైనాన్స్ కేపిటల్‌కు అనుకూలంగా నయా ఉదారవాద విధానాల అమలుకు మార్గాలు వేయడమే. కార్పొరేట్లకు అడ్డుగా ఉన్న చట్టాలను సమూలంగా మార్చడమే. ఎ.పి. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌లో పొందుపర్చిన అంశాలు ఆ లక్ష్య సాధనకే. రాష్ట్రంలో 90 శాతం భూవివాదాలకు హేతువు రెవెన్యూ వ్యవస్థే. పలు కేసుల్లో న్యాయస్థానాలు ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టాయి కూడా. రెవెన్యూ అధికారుల చేతుల్లో ప్రజల ఆస్తులను పెట్టడం దొంగకు తాళాలివ్వడమే. బాధితులు డివిజనల్, జిల్లా స్థాయి సివిల్ కోర్టులకు వెళ్లే అవకాశం లేదు. ఇది రాజ్యాంగం కల్పించిన హక్కును కాలరాయడమే. రాష్ట్ర స్థాయి అథారిటీ తీర్పులపై నేరుగా హైకోర్టుకే వెళ్లాలి. హైకోర్టుకెళ్లే స్తోమత ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, పేదలకు, చిన్న సన్నకారు రైతులకు లేదు. భూములను, హక్కులను కోల్పోవడం తప్ప వారికి మరే గత్యంతరం ఉండదు. ఇదే అదనుగా ఇష్టారీతిన కార్పొరేట్లు భూములను కాజేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఎ.పి లో జరుగుతున్న సమగ్ర భూ సర్వే తంతైనా, గత ప్రభుత్వ హయాంలో తెలంగాణలో ధరణి దందాకైనా మూలం కేంద్ర విధానాలే. ప్రజల హక్కులకు ప్రమాదంగా మారిన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని ప్రతిఘటించి పోరాడాల్సిన ఆవశ్యకత ఉంది.

మహనీయుల మాట



ప్రజలంటే సంపదను సృష్టించేవాళ్లు మాత్రమే కాదు. ఆధ్యాత్మిక విలువలను కూడా అనునిత్యం సృష్టిస్తూ వుంటారు. సౌందర్యం, మేధస్సు ఆ క్రమంలో వికసిస్తూనే వుంటాయి. తాత్విక ఆలోచనలు, కవిత్వం వగైరాలన్నీ ఆ ప్రజల సమిష్టి జీవన క్రమంలోంచే రూపొందుతాయి.

- గోర్కీ
ప్రపంచ ప్రసిద్ధ రష్యన్ రచయిత.

సందర్భం



యుద్ధ అనాథల కోసం...

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం జనవరి 6వ తేదీన "ప్రపంచ యుద్ధ అనాథల దినోత్సవం (వరల్డ్ వార్ ఆర్ఫన్స్ డే)" జరుపుకుంటున్నాం. ప్రపంచ వ్యాప్తంగా యుద్ధాలు, వ్యాధులు, పేదరికం, కరువు, ప్రకృతి విపత్తుల వలన 18 సంవత్సరాల లోపు పిల్లలు తల్లిదండ్రులను కోల్పోయినట్లయితే వారిని అనాథలుగా పరిగణిస్తారని యునిసెఫ్ తెలిపింది.

యుద్ధాల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న అనాథల విషయం రెండవ ప్రపంచ యుద్ధానంతరం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. దీనికి కారణం రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఒక్క పోలెండ్ లోనే 3 లక్షల మంది, యుగోస్లేవియాలో 2 లక్షల మంది అనాథలుగా మారారు. వీరి భవిష్యత్తు కోసం తీసుకోవలసిన చర్యలపై దృష్టి సారించారు. ప్రస్తుతం మన కళ్ళ ముందే జరుగుతున్న ఇజ్రాయిల్-పాలస్తీనా యుద్ధంలో సుమారు పాతికవేల మంది మరణించారని వీరిలో 9 వేల మంది అభం-శుభం తెలియని పసికందులన్న విషయం యావత్ ప్రపంచాన్ని కలవర పరచింది. ఇంకా ఎన్ని ప్రాణాలు గాల్లో కలవాలో...ఈ యుద్ధం ఆగేదెన్నడో...!? అంతర్జాతీయ స్థాయిలో ఇటువంటి యుద్ధాలు ఆపడానికి అన్ని దేశాలు ముందుకు రావాలి. అనాథలుగా మారుతున్న వారి సంక్షేమం కోసం అంతర్జాతీయ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలి.

ఆధిపత్యం కోసం, మత వ్యాప్తి కోసం, జాతి, లింగ, భాష, ప్రాంతం వంటి వివక్షతలతో మనుషుల మధ్య, దేశాల మధ్య ఘర్షణలు, యుద్ధాలు జరుగుతూ అనేక మంది అనాథలుగా మారుతున్నారు. 2015 నాటికే ప్రపంచ వ్యాప్తంగా 14 కోట్ల మంది అనాథలు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఆసియాలో 6.1 కోట్లు, ఆఫ్రికాలో 5.2 కోట్లు, లాటిన్ అమెరికా, అరేబియన్ దేశాల్లో ఒకో కోటి, తూర్పు ఐరోపా, సెంట్రల్ ఆసియాలో 73 లక్షల మంది అనాథలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మన దేశంలో సుమారు 30 లక్షల మంది అనాథలు వున్నారు. వీరిలో ఎక్కువ మంది అక్రమ రవాణాకు గురవుతున్నారు. భిక్షాటన వంటి వృత్తులు చేపడుతున్నారు. అవిద్య, అనారోగ్యం, పోషకాహార లోపం, గృహ వసతి లేకపోవడం వంటి సమస్యలతో బాధ పడుతున్నారు.

వివిధ రకాలుగా అనాథలుగా మారుతున్న వారి సంక్షేమం, ఆరోగ్యం, చదువు అందించి ప్రయోజకులుగా మార్చే ఉద్దేశ్యంతోనే ప్రపంచ వ్యాప్తంగా యుద్ధ అనాథల దినోత్సవం జరుపుకుంటున్నాం. ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలు తమ ఆధిపత్య ధోరణి విడనాడాలి. అంతర్జాతీయ సంస్థలు పారదర్శకంగా పనిచేయాలి. అసమానతలు, వివక్షతల నిర్మూలనకు కృషి చేయాలి. ధనిక, పేద ప్రజల మధ్య అంతరం తగ్గించాలి. జాతి, లింగ వివక్షతను తొలగించాలి. ఆర్థిక, సామాజిక అంతరాలు తగ్గించాలి. విద్య అందరికీ సమానంగా అందించాలి. సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రపంచ దేశాలు పయనించాలి.ముఖ్యంగా అనాథలను వివక్షతో చూడరాదు. మానసికంగా శారీరకంగా హింసించరాదు. లైంగిక వేధింపులు చేయరాదు. వీరికి చదువు, సంస్కారం నేర్పాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. వలసలను అరికట్టాలి. అనాథలను అన్ని రకాలుగా అభివృద్ధి పరచి, మంచి పౌరులుగా తీర్చిదిద్దటమే ఈ యుద్ధ అనాథల దినోత్సవ పరమార్థం.

- ఐ. ప్రసాదరావు,
సెల్ : 6305682733

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

గాజా : అంతులేని యుద్ధం!

విశ్లేషణ

కొత్త సంవత్సరం 2024లోనూ గాజాలో సైనిక ఆపరేషన్ కొనసాగుతుందని ఇజ్రాయిల్ రక్షణ బలగాలు (ఐడిఎఫ్) ప్రకటించాయి. హమాస్‌ను పూర్తిగా నిర్మూలించేవరకు గాజాలో యుద్ధం కొనసాగి తీరుతుందని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పదే పదే చెబుతూ వస్తున్నారు. ఈజిప్ట్‌తో వున్న గాజా సరిహద్దును ఇజ్రాయిల్ నియంత్రిస్తుందని కూడా ఆయన చెప్పారు. అంటే మొత్తంగా గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయిల్‌కు పూర్తి నియంత్రణ వుంటుంది. గాజా స్ట్రిప్‌లో మూడు మాసాల పాటు వైమానిక, పదాతి, నావికా దళ ఆపరేషన్లు కొనసాగిన తర్వాత కూడా హమాస్‌ను ఇజ్రాయిల్ సాయుధ బలగాలు నిర్మూలించలేక పోయాయి. లేదా హమాస్ కార్యకర్తలు ప్రదర్శించే ప్రతిఘటనను అంతం చేయలేకపోయాయి. అంటే హమాస్‌ను సైనిక బలగాలు నిర్మూలించలేవన్నది వాస్తవం. ఒకవేళ సైనికపరంగా ఓడించినా, ఏదో ఒక రూపంలో మళ్లీ తలెత్తడం ఖాయం.

గాజాలో పూర్తిగా జాతి ప్రక్షాళన జరిగేలా చూడాలన్నదే ఇజ్రాయిల్ సాగిస్తున్న ఈ అంతులేని యుద్ధం వెనుక గల అసలు లక్ష్యం. ఇరుకుగా వుండే ఈ సన్నని ప్రాంతంలో ఎవరూ నివసించకుండా చూడాలని భావిస్తోంది. గాజా నుండి పాలస్తీనియన్లందరినీ తరిమికొట్టి, ఆకలితో మాడ్చి చంపాలని చూస్తోంది. పాలస్తీనా ప్రజల వరకు, ఈ విపత్తు 1948 లోనే ప్రారంభమైంది. ఇంకా కొనసాగుతునే వుంది.

అక్టోబరు 7 నుండి, ఇప్పటివరకు (డిసెంబరు మూడో వారం వరకు) గాజాపై ఇజ్రాయిల్ దాదాపు 29 వేల బాంబులతో దాడులు జరిపింది. ఇరాక్‌లో అమెరికా బాంబు దాడులతో దీన్ని పోల్చి చూసినట్లైతే...ఇరాక్‌లో 2004-2010 మధ్య కాలంలో 3678 బాంబులను మాత్రమే వేశారు. 85 శాతం మంది ప్రజలు ఇప్పటికే నిర్వాసితులయ్యారు. డిసెంబరు 12న ప్రపంచ బ్యాంక్ వెల్లడించిన వివరాల ప్రకారం, 77 శాతం ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు, పార్కులు, కోర్టులు, లైబ్రరీలతో సహా 72 శాతం పౌర భవనాలు, 68 శాతం కమ్యూనికేషన్ వసతులు, గాజాలోని పారిశ్రామిక జోన్ యావత్తూ ఇజ్రాయిల్ దురాక్రమణలో తుడిచి పెట్టుకుపోయాయి.

గత 88 రోజులుగా సాగుతున్న ఈ మారణహోమంలో 22 వేల మందికి పైగా మరణించారు. అంటే ప్రతి రోజూ దాదాపుగా 250 మంది చనిపోయారన్నమాట. వీరిలో దాదాపు 90 మంది వరకు చిన్నారులే వున్నారు.

గాజా నుండి పాలస్తీనా ప్రజలను సమూలంగా నిర్మూలించాలన్న ప్రకటిత లక్ష్యంతో ఇజ్రాయిల్ సాయుధ బలగాలు ఒక పద్ధతి ప్రకారం సాగిస్తున్న ఊచకోతకు యావత్ ప్రపంచం సాక్షీభూతంగా నిలిచింది. ఇదేమీ అతిశయోక్తితో చెబుతున్నది కాదు, మితవాద ప్రభుత్వంలోని మంత్రులు దీని



PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

> **ప్రభుత్వ ఆదేశాలతో జరిగే మారణకాండ, జాతి ప్రక్షాళన చర్యలతో ఇజ్రాయిల్ ముందుకు సాగగలుగుతోందంటే దానికి ప్రధాన కారణం అమెరికా సామ్రాజ్యవాదం ఇందుకు పూర్తి మద్దతును అందించడమే. గాజాలో తక్షణమే కాల్పుల విరమణ జరగాలని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో 150 దేశాలు ఓటు వేసినా, ఈ దిశగా అస్సలు ఎలాంటి కదలికా లేదు. భద్రతా మండలిలో ఇటువంటి తీర్మానాలన్నింటినీ అమెరికా వీటో చేయడమే ఇందుకు ప్రధాన కారణం. మూకుమ్మడి హత్యాకాండను సాగించడానికి ఒకపక్క ఇజ్రాయిల్‌కు మారణాయుధాలను, మందుగుండు సామగ్రిని అందిస్తూ, మరోపక్క గాజాలో పౌర మరణాలను తగ్గించడం గురించి అమెరికా నయవంచనతో మోసపూరితంగా మాట్లాడుతోంది.**

గురించి బహిరంగంగానే ప్రకటించారు. ఈ ఘర్షణకు పరిష్కారంగా పాలస్తీనా పౌరులందరూ వలస వెళ్ళిపోవాలని యూదు తీవ్రవాద జాతీయ భద్రతా మంత్రి బెన్-గివిర్, ఆర్థిక మంత్రి స్మాట్రిచ్‌లు పిలుపిచ్చారు.

గాజా ప్రజలు వలస వెళ్లిపోవడాన్ని ప్రోత్సహించడంపై దృష్టి కేంద్రీకరించేందుకు ఈ యుద్ధం ఒక అవకాశాన్ని కల్పించిందని బెన్-గివిర్ వ్యాఖ్యానించారు. స్మాట్రిచ్ కూడా దీన్ని సమర్ధించారు. గాజా ప్రజలు స్వచ్ఛందంగా వలస వెళ్ళేలా ప్రోత్సహించాల్సి వుందంటూ ఆయన కూడా మాట్లాడారు. సెటిల్‌మెంట్లను ఏర్పాటు చేయడంతో పాటు గాజా స్ట్రిప్ భూభాగాన్ని ఇజ్రాయిల్ శాశ్వతంగా తన అదుపులో వుంచుకుంటుందని జోస్యం చెప్పారు. ఉత్తర సినాయ్ ప్రాంతం (ఈజిప్ట్‌కు సమీపాన గల) పాలస్తీనియన్లకు ఆశ్రయం పొందడానికి ఎంత మంచి ప్రాంతమో అంటూ ఇజ్రాయిల్ మీడియాలో చర్చలు కూడా జరుగుతున్నాయి.

పాలస్తీనా వ్యతిరేక ఆపరేషన్‌ను విస్తృతంగా చేపట్టడానికి నెతన్యాహు మితవాద ప్రభుత్వం, అక్టోబరు 7న హమాస్ జరిపిన దాడిని అవకాశంగా తీసుకుంది. వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలేంలో పాలస్తీనియన్లపై దాడులను ఉధృతం చేసిన తీరు చూస్తే ఇది స్పష్టమవుతోంది. ఇజ్రాయిల్ ఆర్మీ దాడుల్లో, సెటిలర్లు జరిపిన దాడిలో వెస్ట్ బ్యాంక్‌లో 300 మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. 4,700 మందికి పైగా అరెస్టయ్యారు, నిర్బంధించబడ్డారు. పాలస్తీనా రైతులు వ్యవసాయ కార్యకలాపాలు చేపట్టకుండా నిలువరించారు. వారి ఆలివ్ చెట్ల దిగుబడులను కోసుకోనివ్వకుండా అడ్డగించారు. వారి భూములను, ఇళ్ళను లాక్కున్నారు. వెస్ట్ బ్యాంక్ అంతటా 7 లక్షల మంది ఇజ్రాయిలీ సెటిలర్లు అక్రమంగా నివాసాలను ఏర్పరచుకున్నారు. అక్కడి పాలస్తీనీయులను బంటుస్థాన్ తరహా ప్రాంతాలకు బలవంతంగా తరిమేస్తున్నారు. 'బంటుస్థాన్' లనేవి దక్షిణాఫ్రికాలో వర్ణవివక్ష ప్రభుత్వం పెత్తనం చేసినప్పుడు ఉనికిలో వుండేవి. ఈ ప్రాంతాలు కటిక దారిద్ర్యానికి, వెనుకబాటుతనానికి, వర్ణవివక్షకు నిలువెత్తు సాక్ష్యంగా వుండేవి. ఇప్పుడు పాలస్తీనీయులు అటువంటి దుర్భర స్థితికి నెట్టబడ్డారు.

ప్రభుత్వ ఆదేశాలతో జరిగే మారణకాండ, జాతి ప్రక్షాళన చర్యలతో ఇజ్రాయిల్ ముందుకు సాగగలుగుతోందంటే దానికి ప్రధాన కారణం అమెరికా సామ్రాజ్యవాదం ఇందుకు పూర్తి మద్దతును అందించడమే. గాజాలో తక్షణమే కాల్పుల విరమణ జరగాలని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో 150 దేశాలు ఓటు వేసినా, ఈ దిశగా అస్సలు ఎలాంటి కదలికా లేదు. భద్రతా మండలిలో ఇటువంటి తీర్మానాలన్నింటినీ అమెరికా వీటో చేయడమే ఇందుకు ప్రధాన కారణం. మూకుమ్మడి హత్యాకాండను సాగించడానికి ఒకపక్క ఇజ్రాయిల్‌కు మారణాయుధాలను, మందుగుండు సామగ్రిని అందిస్తూ, మరోపక్క గాజాలో పౌర మరణాలను తగ్గించడం గురించి అమెరికా నయవంచనతో మోసపూరితంగా మాట్లాడుతోంది.

ఇజ్రాయిల్, ఉక్రెయిన్‌లకు అందచేయాల్సిన 10.6 కోట్ల డాలర్ల సహాయ ప్యాకేజీ అమెరికన్ కాంగ్రెస్‌లో స్తంభించిన నేపథ్యంలో బైడెన్ ప్రభుత్వం డిసెంబరు మాసంలోనే రెండుసార్లు ఇజ్రాయిల్‌కు అత్యవసర ఆయుధాల అమ్మకాలను ఆమోదించింది. 10.6 కోట్ల డాలర్లకు పైగా మొత్తం విలువ చేసే 14 వేల రౌండ్ల ట్యాంక్ మందుగుండు అమ్మకాలను మొదటిసారిగా ఆమోదించారు. దాని తర్వాత రెండోసారి అత్యవసరంగా 14.75 కోట్ల డాలర్ల విలువ చేసే పరికరాల అమ్మకాలను ఆమోదించారు. వీటిలో ఇజ్రాయిల్ అప్పటికే కొనుగోలు చేసిన 150 ఎంఎం షెల్స్‌ను ఉపయోగించడానికి అవసరమైన పరికరాలు ఫ్యూజులు, చార్జర్లు, ప్రైమర్లు వంటివి వున్నాయి. ఐక్యరాజ్య సమితి నిర్వహించే పాఠశాలలు, ఆస్పత్రుల్లో ఆశ్రయం పొందుతున్న మహిళలు, పిల్లలు, ఆరోగ్య సిబ్బందిని చంపడానికి ఈ షెల్స్‌ను ఉపయోగిస్తున్నారు. గాజాలో సాగుతున్న మారణకాండ, ఊచకోత పట్ల అమెరికా పూర్తి ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ఇజ్రాయిల్, అమెరికా సామ్రాజ్యవాదం మధ్యగల సంబంధాన్ని అర్థం చేసుకోలేకపోతే పాలస్తీనియన్ల జాతి ప్రక్షాళన ప్రక్రియ గురించి అర్థం చేసుకోలేం. సెటిలర్, వలసవాద దేశంగా ఇజ్రాయిల్ మనుగడ సాగిస్తోంది. అమెరికా సామ్రాజ్యవాదం పూర్తి స్థాయి మద్దతుతో దశాబ్దాలుగా అది మరింతగా బలపడుతోంది. ఇజ్రాయిల్ మాదిరిగా మరే ఇతర దేశానికి కూడా అమెరికా ఇంతలా ఆయుధాలను అందచేస్తూ, ఆర్థికంగా మద్దతివ్వలేదు. కేవలం అమెరికా జోక్యం కారణంగానే ఈజిప్ట్‌తో మొదలుపెడితే, ఒకదాని తర్వాత మరొకటిగా అరబ్ దేశాలన్నీ పాలస్తీనా ప్రయోజనాలను మోసగించడం ద్వారా ఇజ్రాయిల్‌తో శాంతి, సహకారానికి ప్రయత్నిస్తూ వచ్చాయి.

లౌకిక అరబ్ జాతీయవాద శక్తులను ఎదుర్కొనడానికి, ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలకు వెసులుబాటు కల్పిస్తూ, రాజకీయ, సామాజిక మార్పును వ్యతిరేకించే రాజ్యాలు (రియాక్షనరీ కింగ్‌డమ్), షేక్‌లకు అమెరికా ఆసరాగా నిలిచింది. వీటిలో తాజాది అబ్రహమ్ ఒప్పందాలు. అరబ్ దేశాల పాలకులు పాలస్తీనియన్లను కించపరిచినప్పటికీ అరబ్ దేశాల ప్రజలు మాత్రం ఎన్నడూ పాలస్తీనాకు తమ మద్దతును, సంఘీభావాన్ని వీడలేదు. మొత్తంగా అరబ్ ప్రాంతంలో గాజా ప్రజలకు పెద్ద ఎత్తున మద్దతును అందిస్తూ ప్రస్తుతం తలెత్తిన ఈ తిరుగుబాటు, ఆందోళనలు అమెరికా-ఇజ్రాయిల్ కూటమి ఏం చేసినా, పాలస్తీనా ప్రజల పోరాటం ఎన్నడూ కూడా ఏకాకి కాదు, అణచివేతకు గురవదని స్పష్టం చేస్తున్నాయి. లెబనాన్ సరిహద్దుల్లో ఇజ్రాయిల్ బలగాలు, హిజ్బుల్లా మధ్య ఘర్షణలు, ఎర్ర సముద్రంలో ఆత్మాహుతి దాడులు ఉధృతం కావడంతో ప్రాంతీయ ఘర్షణలు మరింత విస్తరిస్తున్నాయనడానికి ఇవి కొన్ని సంకేతాలు. ఈ చర్యల ఫలితంగా తలెత్తే పర్యవసానాలు ప్రస్తుతమున్న భౌగోళిక, రాజకీయ సమతుల్యతను దెబ్బతీయవచ్చు.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

స్టాక్ మార్కెట్ వీరంగం దేనికి సంకేతం?

విమర్శ



పి. సతీష్

మన దేశీయ సెన్సెక్స్‌లో ఇండెక్స్ 72,000 దాటిందని, ఇది ప్రభుత్వ ఘనతగా కొన్ని పత్రికలు, ప్రభుత్వ అనుకూల ఆర్థికవేత్తలు హంగామా చేస్తున్నారు. ఇదే ఊపులో ఇండెక్స్ ఒక లక్ష దాటినా ఆశ్చర్యం లేదని ఊదరకొడుతున్నారు!! లోతుగా పరిశీలిస్తే సెన్సెక్స్‌లో ఉండే 30 కంపెనీల వెయిటేజీలో ఆరు కంపెనీలకు దాదాపు 48 శాతం వెయిటేజీ ఉంది. అవి ఆర్ఐ ఎల్, ఐటిసి, ఇన్ఫోసిస్, ఐసిఐసిఐ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి ఈ షేర్ల ధరలను బట్టి సెన్సెక్స్ పెరగడం, తగ్గడం జరుగుతోంది. సెన్సెక్స్ పెరుగుదల, తగ్గుదల ఆరు కంపెనీలపై ఆధారపడి ఉంటే, అది ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులను ఎలా ప్రతిబింబిస్తుంది? దేశ ఆర్థిక వ్యవస్థ అద్భుతంగా ఉంటే అభివృద్ధి సూచికలు అన్నింటిలో మన దేశం ఎందుకు తీసికట్టుగా ఉంటోంది? 80 కోట్ల మంది ప్రభుత్వం నెలకు ఇచ్చే ఐదు కేజీల తిండిగింజలపై ఎందుకు ఆధారపడి ఉన్నారు? ప్రజల ఆదాయాలు, జీవన ప్రమాణాలు దిగజారి, కుటుంబ అప్పు ఎందుకు పెరుగుతోంది? కనీవినీ ఎరుగని నిరుద్యోగం దేశంలో ఎందుకు తాండవ మాడుతోంది? కాబట్టి ఆర్థిక వ్యవస్థ తీరు తెన్నులకు, సెన్సెక్స్ పరుగులకు ఎలాంటి సంబంధం లేదని మనకు తెలుస్తుంది. దేశంలో పెరుగుతున్న ఆదాయ అసమానతలు ఈ మార్కెట్ వీరంగానికి ప్రధాన కారణం. దేశంలో ఒకశాతం ధనికులు లక్షల కోట్ల రూపాయల ఆస్తులు కలిగి ఉన్నారు. ప్రతీ ఏటా ధనికుల సంపద ఇబ్బడిముబ్బడిగా పెరుగుతోంది. దేశంలోని ధనిక కుటుంబాలు 2022-23లో 20 లక్షల కోట్ల రూపాయల వ్యక్తిగత సంపద పెంచుకున్నట్లు నిపుణులు చెబుతున్నారు. దీనిలో కొంతభాగం దేశీయ స్టాక్ మార్కెట్‌లోకి ప్రవేశించింది. అందుకే గత ఏడాది దేశీయ ఫండ్స్ నుంచి 20 బిలియన్ డాలర్లు, 15 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు మన దేశీయ స్టాక్ మార్కెట్ లోకి వచ్చాయి.

గతేడాది సెన్సెక్స్‌లో ధనికుల పెట్టుబడులపై వారికి 20 శాతం దిగుబడి రావడం విశేషం!! 2024లో సైతం ధనిక మదుపుదారులకు లాభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లు తగ్గించే సూచనలు కనిపిస్తు న్నాయి. దీని ప్రభావం మన దేశంపై కూడా పడుతుంది. అమెరికాలోని మదుపుదారులు అక్కడ చౌకగా రుణాలు పొంది, వాటిని అమెరికన్, ఇండియా స్టాక్ మార్కెట్‌లలో సైతం పెట్టుబడులు పెట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) కూడా వడ్డీరేట్లు తగ్గిస్తే, ఇక్కడ దేశీయ మదుపుదారులు స్టాక్ మార్కెట్‌లలో పెట్టే మొత్తాలు ఇంకా పెరుగుతాయి. స్టాక్ మార్కెట్ల పూనకం కొనసాగుతుంది. అయితే, రిటైల్ మదుపుదారులు స్టాక్ మార్కెట్‌లలో స్పెక్యులేటివ్ పెట్టుబడులు పెద్దఎత్తున పెడుతుండడం ఆందోళనకరం. ఫ్యూచర్ మార్కెట్‌లో లాభాలు రావాలంటే, ఎక్కువ సంఖ్యలో షేర్లు కొనాలి. ఉదాహరణకు క్యాష్ మార్కెట్‌లో 100 ముఖవిలువతో 20 వేల షేర్లు కొనాలంటే, 20 లక్షల రూపాయలు ఖర్చు చేయాలి. అదే డెరివేటివ్ మార్కెట్‌లో పది శాతం మార్జిన్ అమౌంట్ చెల్లిస్తే సరిపోతుంది. అయితే, షేర్ ధరలు పడిపోతే, భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఇతర దేశాల్లో క్యాష్ మార్కెట్‌లో డెరివేటివ్ మార్కెట్ వాటా ఐదు నుంచి పది శాతం ఉంటుంది. మన దేశంలో ఇది 400 రెట్లు ఉంది. ఒకవేళ, మార్కెట్లు ఉన్నపళంగా కుప్పకూలితే దీని ప్రభావం అప్పుల మీద, చెల్లింపుల మీద పడుతుంది. అప్పుడు పారు బకాయిల భారం పెరుగుతుంది. దీనర్థం ఏమిటంటే ప్రజల సొమ్ముతో కార్పొరేట్లు, బడా ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్‌లో పెద్దఎత్తున లాభాలు ఆర్జిస్తున్నారు. నష్టం వస్తే బ్యాంకులకు, ఎన్‌బిఎఫ్‌సి లకు పంగనామాలు పెడుతున్నారు. ఒక రైతు ట్రాక్టర్ కొనుక్కోవ డానికి ఆయనకు 14 శాతం నుండి 16 శాతం వడ్డీ వసూలు చేస్తున్నారు. కానీ కాల్ మనీ, షార్ట్ టర్మ్ లోన్ పేర్లతో స్టాక్ బ్రోకర్లకు, మదుపుదారులకు కారుచౌకగా అప్పులు దొరుకుతున్నాయి. నిజ ఆర్థిక వ్యవస్థ కన్నా, స్టాక్ మార్కెట్ అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వాలు పనిచేయడం వల్ల ఇదంతా జరుగుతోంది

1996లో ఎన్రాన్ కంపెనీ విద్యుత్ ఉత్పత్తి చేస్తామని ఇలాగే ప్రభుత్వ బ్యాంకుల నుండి అప్పు తీసుకుని, ఆనాటి మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకుని చివరికి ఉత్పత్తి చేయకుండానే మన దేశం నుంచి ఉడాయించింది. దానికి అప్పు ఇచ్చిన బ్యాంకులు మునిగాయి. ఆ కంపెనీలో షేర్లు కొన్న సామాన్య మదుపుదారులు మునిగారు. చివరికి ఆ కంపెనీ ఉద్యోగులు కూడా మునిగిపోయారు. స్టాక్ అప్షన్ల పేరుతో ఎన్రాన్ ఉద్యోగులకు ఇచ్చిన షేర్లు చిత్తు కాగితాలుగా మిగిలాయి. కింగ్ ఫిషర్, నీరవ్ మోడీల కథలు ఇవే కదా!! 2021-22లో ఎఫ్‌డిఐ రూపేణా రూ.4.37 లక్షల కోట్లు మన దేశ ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశిస్తే, 2022-23 సంవత్సరంలో మన దేశంలోకి విదేశీ పెట్టుబడులు భారీగా తగ్గి రూ.3.67 లక్షల కోట్లు మాత్రమే వచ్చాయి. మన దేశంలోకి వచ్చిన ఎఫ్‌డిఐ కూడా సేవా రంగంలోకి, సాఫ్ట్‌వేర్ రంగంలోకి కీలకంగా వచ్చింది. తయారీ రంగం, నిర్మాణ రంగంలో, నైపుణ్య మెరుగుదల రంగంలోకి ఎఫ్‌డిఐ నామమాత్రంగా వచ్చింది. ఇది దేశ అభివృద్ధికి ఎలా దోహదపడుతుంది? అస్థిరమైన విదేశీ పెట్టుబడుల కోసం అర్రులు చాస్తున్నారు. విదేశీ పోర్టుఫోలియో పెట్టుబడులు దేశ ఆర్థిక వ్యవస్థలను ఎలా దెబ్బ తీస్తాయో, 80, 90 దశకంలో ఆగ్నేయాసియా దేశాల ఆర్థిక వ్యవస్థల పతనం చూస్తే తెలిసి పోతుంది. ఇన్ని దశాబ్దాల అనుభవం ఉన్నా, ప్రభుత్వాలు విదేశీ పెట్టుబడులు కోసం ఎగబడుతూ, చేయని పని లేదు.



> **దేశంలో పెరుగుతున్న ఆదాయ అసమానతలు ఈ మార్కెట్ వీరంగానికి ప్రధాన కారణం. దేశంలో ఒక శాతం ధనికులు లక్షల కోట్ల రూపాయల ఆస్తులు కలిగి ఉన్నారు. ప్రతీ ఏటా ధనికుల సంపద ఇబ్బడిముబ్బడిగా పెరుగుతోంది. దేశంలోని ధనిక కుటుంబాలు 2022-23లో 20 లక్షల కోట్ల రూపాయల వ్యక్తిగత సంపద పెంచుకున్నట్లు నిపుణులు చెబుతున్నారు. దీనిలో కొంతభాగం దేశీయ స్టాక్ మార్కెట్‌లోకి ప్రవేశించింది. అందుకే గత ఏడాది దేశీయ ఫండ్స్ నుంచి 20 బిలియన్ డాలర్లు, 15 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు మన దేశీయ స్టాక్ మార్కెట్ లోకి వచ్చాయి.**

దేశంలో నియంత్రణా వ్యవస్థల నిర్వహణ సామర్థ్యం వల్లే 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని మన దేశం సమర్థవంతంగా ఎదుర్కొనగలిగింది. బ్యాంకులలో ద్రవ్య లభ్యత ఎంత ఉండాలి, ఎంతమేర అప్పులివ్వాలి, మూల ధనం ఎంత ఉండాలో మన దేశంలో కఠిన చట్టాలు ఉన్నాయి. అయితే, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఒత్తిడి మేరకు, వాటిని నిర్వీర్యం చేయాలనే ప్రయత్నాలు వేగవంతమయ్యాయి. అందుకే రానురానూ దేశంలో నియంత్రణా వ్యవస్థల పరిధికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇచ్చే పరపతి రుణాలు కోతకు గురవుతున్నాయి. కార్పొరేట్ రుణాలు, అంత కంతకూ పెరుగుతున్నాయి. ప్రజల సొమ్ముతో వ్యాపారాలు చేసి కార్పొరేట్లు వేల కోట్ల రూపాయలు ఆర్జించడం, అప్పులను ఎగ్గొట్టి బ్యాంకులను ముంచడం, ఆ బ్యాంకులను కాపాడే మిషతో ప్రభుత్వం ప్రజాధనాన్ని మళ్లీ బ్యాంకులకు కాపిటల్‌గా అందించడం ఇదే పరిపాటి అయ్యింది

కార్పొరేట్ కంపెనీల పారు బకాయిలను ఎందుకు మాఫీ చేస్తున్నారు? వారి అప్పులను గోళ్ళూడగొట్టి ఎందుకు వసూలు చేయరు? బ్యాంకులను ఎందుకు ప్రయివేటుపరం చేస్తున్నారు? ప్రజలు చైతన్యపూర్వకంగా ఈ ప్రశ్నలు అడిగి, ప్రభుత్వాలను నిలదీయనంత కాలం ఈ దోపిడీ విశృంఖలంగా సాగుతూనే ఉంటుంది!! ప్రజల డబ్బుతో కొంత మంది బడా బాబులు స్టాక్ మార్కెట్‌లో జూదం ఆడుతూనే ఉంటారు!! స్టాక్ మార్కెట్ల వీరంగం చూసి, నిజ ఆర్థిక వ్యవస్థ పెరుగుతోందని భ్రమ పడేవారు ఈ వాస్తవాలు గ్రహించాలి.

/ వ్యాసకర్త సెల్ : 9441797900 /

సిఎస్‌బి ఉద్యోగులకు ఎఫ్‌డిఐ కష్టాలు

- వేతన పెంపునకు యాజమాన్యం నిరాకరణ

కొచ్చీ : కేరళలోని 100 ఏళ్ల నాటి అతి పురాతన బ్యాంక్‌ల్లో ఒక్కటైన సిఎస్‌బిలోని ఉద్యోగులు ఆందోళనకు గురైతున్నారు. ఈ బ్యాంక్‌లోకి ఎఫ్‌డిఐలు వచ్చిన తర్వాత ఉద్యోగులపై ప్రతికూల ప్రభావం పడుతోంది. 704 శాఖలు కలిగిన సిఎస్‌బిలో 6,800 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. సిఎస్‌బిలోకి ఎఫ్‌డిఐలు వచ్చిన తర్వాత మేనేజ్‌మెంట్ విధాన నిర్ణయాలు పూర్తిగా మారిపోయాయి. డిసెంబర్ తొలి వారంలో యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు), ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ) 12వ ద్వైపాక్షిక సెటిల్‌మెంట్‌పై సంతకం చేశాయి. 180 రోజుల్లోగా తుది ఒప్పందం కుదుర్చుకోవడం బ్యాంకు ఉద్యోగులకు కొంత ఊరటనిచ్చినప్పటికీ.. సిఎస్‌బి గతంలో క్యాథలిక్ సిరియన్ బ్యాంక్ ఉద్యోగులు ఇప్పటికీ 10వ బైపార్టీ సెటిల్‌మెంట్ ప్రకారమే వేతనాలు తీసుకుంటున్నారు. బ్యాంక్ మేనేజ్‌మెంట్ 11వ ద్వైపాక్షిక సెటిల్‌మెంట్‌ను అమలు చేయడానికి నిరాకరించింది. 2018 తర్వాత కెనడా ఆధారిత ఫెయిర్‌ఫాక్స్ సిఎస్‌బిలో పెట్టుబడులు పెట్టింది. ఆ తర్వాత వేతన సవరణను మేనేజ్‌మెంట్ నిరాకరించింది. మేనేజ్‌మెంట్ నిర్ణయాన్ని సిఎస్‌బి స్టాఫ్ ఫెడరేషన్ (సిఎస్‌బిఎస్‌ఎఫ్) తీవ్రంగా వ్యతిరేకించింది. నిర్ణీత వేతనాలతో మాత్రమే సిబ్బంది నియామకాలు చేపట్టడం, సామాజిక భద్రతా చర్యలు తీసుకోకపోవడం, మరీ ముఖ్యంగా ఉద్యోగం పోతుందనే భయాలు ఉద్యోగులను వెంటాడుతున్నాయి. విదేశీ పెట్టుబడులు వచ్చిన ఐదేళ్ల స్వల్ప వ్యవధిలో ఉద్యోగుల హక్కులపై స్పష్టమైన ప్రభావాన్ని చూపింది. ఉద్యోగుల నిరసనపై మేనేజ్‌మెంట్ పగతీర్చుకునే చర్యలకు పాల్పడుతుందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. సుదీర్ఘ పని గంటలకు తోడు సామాజిక సంక్షేమ చర్యలు లేకపోవడం సిబ్బందిని ఆందోళనకు గురి చేస్తున్నాయి.

పోస్టల్ ద్వారా పంపండి

- రూ.2 వేల నోట్ల మార్పిడిపై ఆర్‌బిఐ ప్రకటన

న్యూఢిల్లీ : పోస్టాఫీసుల ద్వారా రూ.2 వేల నోట్లను తమ పరిధిలోని 19 ఇష్యూ కేంద్రాలకు పంపి, మార్పిడి చేసుకోవచ్చునని భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) శుక్రవారం ప్రకటించింది. ప్రస్తుతం ఆర్‌బిఐ ఇష్యూ కేంద్రాల వద్ద మాత్రమే రూ.2 వేల నోట్లను మార్పిడి చేసుకునే వీలుండటంతో అక్కడ భారీ రద్దీ నెలకొంటోంది. దేశంలోని ఏ పోస్టాఫీసు నుంచైనా సరే 19 ఆర్‌బిఐ ఇష్యూ కేంద్రాలకు నోట్లను పంపవచ్చునని తెలిపింది. నోట్లతోపాటు అప్లికేషన్ ఫామ్ (ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంది) కూడా పంపాలని పేర్కొంది.

జెఎన్‌యులో దాడికి నాలుగేళ్లు

- ఇప్పటికీ ఎబివిపి గూండాలపై చర్యలు శూన్యం
- ఢిల్లీ పోలీసులపై జెఎన్‌యుటిఎ మండిపాటు

న్యూఢిల్లీ : ప్రతిష్టాత్మకమైన జెఎన్‌యు క్యాంపస్‌లో ముసుగులు ధరించి ఎబివిపి గూండాలు దాడికి పాల్పడిన ఘటనకు నాలుగేళ్లు పూర్తయ్యాయి. ఇప్పటి వరకూ ఎబివిపి గూండాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఢిల్లీ పోలీసులపై జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ టీచర్స్ అసోసియేషన్ (జెఎన్‌యుటిఎ) ఆవేదన వ్యక్తం చేసింది. ఎబివిపి గూండాలు భయంకరంగా దాడులు చేసిన రాత్రి ఇంకా తమ కళ్లముందు ఉందని జెఎన్‌యుటిఎ అధ్యక్షులు డికె లోబియాల్ శుక్రవారం న్యూస్‌క్లిక్‌తో మాట్లాడుతూ గుర్తు చేసుకున్నారు. దాడికి నాలుగేళ్లు పూర్తయినా బాధిత ఉపాధ్యాయులు, విద్యార్థులకు న్యాయం చేయడంలో ఢిల్లీ పోలీసులకు, విశ్వ విద్యాలయ అధికారులకు ఎలాంటి ఆసక్తి లేదని విమర్శించారు. 'ప్రపంచవ్యాప్తంగా ఈ హింసాకాండ చర్చనీయాంశమైనప్పటికీ, ఈ దాడిపై ఛార్జిషీట్ నమోదు చేయడం కానీ, దర్యాప్తును పూర్తి చేయడం కానీ జరగపోవడం మాకు ఆందోళన కలిగిస్తుంది' అని అన్నారు. విచారణ ప్రారంభ సమయంలో బాధితుల నుంచి వాంగ్మూలాలను నమోదు చేసుకున్న పోలీసులు తరువాత ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. దాడికి ప్రణాళిక వేసిన 'ఫ్రెండ్స్ ఆఫ్ ఆర్‌ఎస్‌ఎస్', 'యూనిటీ ఎగైనస్ట్ లెఫ్ట్' అనే వాట్సప్ గ్రూపు సభ్యుల సమాచారాన్ని కూడా ఢిల్లీ పోలీసులు సంపాదించలేకపోయారని ఆరోపించారు. గూండాలపై ఎలాంటి కనీస చర్యలు లేకపోవడం ఈ దాడిలో జెఎన్‌యు అధికారులకు, ఢిల్లీ పోలీసులకు కూడా భాగస్వామ్యం ఉందనే మా వాదనకు బలం చేకూరుస్తుందని అన్నారు. 'ఎబివిపి గూండాలు దాడిచేస్తారనే ముందస్తు సమాచారం ఉన్నా.. గూండాల గుంపును క్యాంపస్‌లోకి అనుమతించారు. హింసను నిరోధించడానికి ఎలాంటి నివారణ చర్యలు తీసుకోలేదు. దాడి జరుగుతున్న సమయంలో సహాయం కోసం చేసిన అనేక ఫోన్‌కాల్స్‌కు ప్రతిస్పందించడంలో విఫలమయ్యారు' అని పోలీసులపై విమర్శలు చేశారు. జెఎన్‌యులో నాలుగేళ్ల క్రితం జరిగిన దాడి 'అసమ్మతిని అణిచివేయడానికి అధికారాన్ని దుర్వినియోగం చేయడం'గా జెఎన్‌యుటిఎ నమ్ముతోందని డికె లోబియాల్ తెలిపారు. జెఎన్‌యులో ఫీజులు పెంచడాన్ని వ్యతిరేకిస్తున్న పేరుతో జనవరి 5, 2020 రాత్రి 7 గంటల సమయంలో సుమారు 50 మంది ఉన్న ఎబివిపి గూండాల గుంపు లాఠీలు, కర్రలు, యాసిడ్‌తో దాడికి దిగింది. ఈ గుంపులో మహిళలు కూడా ఉన్నారు. సుమారు 3 గంటల పాటు దాడి కొనసాగించింది. వామపక్ష సంస్థల నాయకులు, విద్యార్థులే లక్ష్యంగా ఈ దాడి జరిగింది. ఈ దాడిలో 39 మంది గాయపడ్డారు. ఇప్పటి వరకూ నిందితుల్ని అరెస్టు చేయడం కానీ, నిర్బంధంలోకి తీసుకోవడం కానీ జరగలేదు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

ప్రజాశక్తి - ప్యాపిలి (నంద్యాల జిల్లా)

విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన నంద్యాల జిల్లా ప్యాపిలి మండల పరిధిలోని ఊటకొండ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఊటకొండ గ్రామానికి చెందిన రైతు గంగరాజు (55) పొలంలో గొర్రెలు మేపుతూ వాటికీ నీళ్ల తాపెందుకు తనపొలంలో మోటర్ దగ్గరికి వెళ్లారు. మోటర్‌కు స్విచ్ వేయగా పని చేయలేదు. ఫీజ్ వేసేందుకు ప్రయత్నించగా ప్రమాద వశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. గంగరాజుకు భార్య మహేశ్వరి, కుమారుడు, కూతురు ఉన్నారు.

రేపు బంగ్లా పార్లమెంటు ఎన్నికలు

- ముగిసిన ప్రచారం

ఢాకా: ఆదివారం జరిగే బంగ్లాదేశ్ 12వ పార్లమెంట్ ఎన్నికలకు ప్రచారం శుక్రవారంతో ముగిసింది. వాగ్దానాల వరద, రాజకీయ నాయకుల విమర్శలు, ప్రతి విమర్శలకు తెరపడింది. ఈ ఎన్నికలు ప్రాథమికంగా ఏకపక్షంగా జరగనున్నాయి. అయినా ప్రజల్లో ఆ ఎన్నికల మూడ్ పెద్దగా కనిపించడం లేదు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కాజీ హబీబుల్ అవల్ శనివారం సాయంత్రం 7 గంటలకు జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఇప్పటికే పాతుకుపోయిన రెండు పార్టీల రాజకీయ వ్యవస్థను బద్దలు కొట్టకుండా దేశ రాజకీయ పరిస్థితిలో మార్పు సాధ్యం కాదని పలువురు పరిశీలకులు భావిస్తున్నారు. ఎన్నికల్లో అభ్యర్థులు వాస్తవిక సమాచారాన్ని వెల్లడించుకుండా దాచి పెడుతున్నారు. తద్వారా దేశ ప్రజలను అంధకారంలో ఉంచుతున్నారు. దీంతో ప్రజలు అయోమయంలో పడి ఎన్నికల పట్ల విశ్వాసం కోల్పోతున్నారు.ఒక సారి అధికారంలో ఉన్నవారు అధికారాన్ని వదులుకోరు. తమ వద్ద పోగుపడిన సంపదను కాపాడుకోవడంతోపాటు భవిష్యత్తులో మరిన్ని సంపదలను నిర్మించుకోవాలనే లక్ష్యంతో ముందుకు వస్తారు. రాజకీయాలను 'నిజాయితీ లేని బ్యూరోక్రాట్లు, వ్యాపారవేత్తలు రాజకీయ నాయకుల కూటమి' చేతుల్లో దేశం బందీ అయిందని ఈ పరిస్థితి మార్చేందుకు ఎన్నికలే సరైన మార్గమని పరిశీలకులు పేర్కొన్నారు..

హైకోర్టు తీర్పుపై సుప్రీం తీవ్ర అభ్యంతరం

న్యూఢిల్లీ : బాలిక కిడ్నాప్, అత్యాచారం కేసులో కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తీర్పులోని ప్రతి కాపీ అభ్యంతరకరంగా ఉన్నాయని, ఇలాంటి తీర్పులు రాయడం తీవ్రమైన తప్పిదమని పేర్కొన్నది. ఈ తీర్పు రాసిన వారు తమ సొంత అభిప్రాయాలను చొప్పించడం సబబు కాదని సూచించింది. పశ్చిమబెంగాల్‌లో ఓ యువకుడు 14 ఏళ్ల బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ కేసులో విచారణ జరిపిన ట్రయల్ కోర్టు నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష విధించింది. నిందితుడు ట్రయల్ కోర్టు తీర్పును కలకత్తా హైకోర్టులో అప్పీల్ చేశాడు. గత ఏడాది అక్టోబర్‌లో ఈ కేసులో జస్టిస్ చిత్తరంజన్ దాస్, జస్టిస్ పార్థసారథి సేన్‌ల నేతృత్వంలోని హైకోర్టు డివిజన్ బెంచ్ విస్మయపరిచే తీర్పు చెప్పింది. కౌమార దశలో ఉన్న బాలికలు తమ లైంగిక వాంఛలను అదుపులో పెట్టుకోవాలని వ్యాఖ్యానించింది. ఆ రెండు నిమిషాల సుఖం కోసం బాలికలు పరాజితులుగా మిగిలిపోకూడదని ఉచిత సలహా ఇచ్చింది. నిందితుడికి ట్రయల్ కోర్టు విధించిన 20 ఏళ్ల జైలుశిక్షను రద్దు చేసింది. ఈ కేసును గత డిసెంబర్ 8న సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేసే ఉద్దేశం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందా? లేదా..? తెలియజేయాలని పశ్చిమబెంగాల్ సర్కారుకు నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో బెంగాల్ సర్కారు హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. పిటిషన్‌పై విచారణ ఈ నెల 12న జరుగనున్నది.

జ్ఞాన్‌వాపీ మసీదు సర్వేపై నేడు నిర్ణయం

వారణాసి : జ్ఞాన్‌వాపీ మసీదు కాంప్లెక్స్‌పై భారత పురావస్తు శాఖ (ఎఎస్‌ఐ) సీల్డ్ కవర్‌లో అందచేసిన సర్వే నివేదికపై వారణాసి కోర్టు శనివారం నిర్ణయం తీసుకోనుంది. ఈ సర్వే నివేదికను బహిరంగ పర్చడం, అలాగే హిందు, ముస్లిం తరపు పిటీషనర్లకు నివేదిక కాపీలను అందచేయడంపై శనివారం తీర్పు ఇవ్వనుంది. శుక్రవారం విచారణలో జిల్లా జడ్జి ఎకె విశ్వేష్ ఈ విషయాన్ని తెలిపినట్లు హిందూవుల తరపు న్యాయవాది మదన్ మోహన్ మీడియాకు వెల్లడించారు. ఉత్తర్వులను ఇంకా టైప్ చేయనందు వల్ల, తీర్పును శనివారం వెల్లడిస్తానని జడ్జి చెప్పినట్లు తెలిపారు. శుక్రవారం విచారణకు హిందూ, ముస్లిం తరపు న్యాయవాదులతోపాటు భారత పురావస్తు శాఖ (ఎఎస్‌ఐ) న్యాయవాదులు హాజరయ్యారు. బుధవారం విచారణలో తమ నివేదికను కనీసం నాలుగు వారాల పాటు బహిరంగ పర్చవద్దని ఎఎస్‌ఐ న్యాయవాదులు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. అయితే జడ్జి బిజీగా ఉన్న కారణంగా ఈ విషయంపై గురువారం నిర్ణయం తీసుకోలేకపోయారు. 2023 జులై 21న జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాలతో జ్ఞాన్‌వాపీ మసీదు కాంప్లెక్స్‌లో ఎఎస్‌ఐ శాస్త్రీయ సర్వే నిర్వహించింది. ఈ సర్వే నివేదికను సీల్డ్ కవర్‌లో డిసెంబరు 18న కోర్టుకు సమర్పించింది.

సర్కారుకో దండం

పొర్లు దండాలతో మున్సిపల్ కార్మికుల నిరసన


నెల్లూరులో పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె 11వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం తక్షణమే తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం కార్మికులు వినూత్నంగా నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ప్రభుత్వానికో దండం అంటూ పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. జగన్‌కు మంచి బుద్ధిని ప్రసాదించాలని వేడుకున్నారు. పలు చోట్ల భిక్షాటన చేశారు. ప్రభుత్వం కార్మికుల డిమాండ్ల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా పోటీ కార్మికులతో పనులు చేయిస్తోంది. వారిని అడ్డుకుంటున్న కార్మికులను అరెస్టులు చేయిస్తోంది. ప్రభుత్వం దిగొచ్చి తమ డిమాండ్లు పరిష్కరించేంత వరకూ పోరాటం సాగిస్తామని మున్సిపల్ కార్మికులు తేల్చి చెప్పారు.

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో పోటీ కార్మికులతో చెత్తను తొలగించేందుకు మున్సిపల్ అధికారులు సిద్ధమవ్వగా సిఐటియు నాయకులు, మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నామని, తమను ఇబ్బంది పెట్టొద్దంటూ కార్మికులు పోలీసుల కాళ్లు పట్టుకుని ప్రాధేయపడ్డారు. ఏలూరులోని వెహికల్ డిపో వద్ద వంటావార్పు నిర్వహిస్తుండగా ఇద్దరు సిఐల నేతృత్వంలో పోలీసులు ఒక్కసారిగా దాడి చేశారు. కార్మికులను బలవంతంగా తమ వాహనాల్లోకి ఎక్కించుకుని వెహికల్ డిపో గేట్లు తెరిచి పోటీ కార్మికులతో చెత్త వాహనాలను బయటకు తీశారు. కార్మికులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు దౌర్జన్యంగా ఈడ్చుకెళ్లి వాహనంలో పడేశారు. ముఖ్య నాయకులను స్టేషనుకు తీసుకెళ్లారు. కార్మికుల అరెస్టులను యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య ఖండించారు. మున్సిపల్ కమిషనర్ బెదిరింపులతో పనులు చేయించడాన్ని నిరసిస్తూ శనివారం మున్సిపల్ ఆఫీసు ముట్టడి నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సందర్శించి సంఘీభావం తెలిపారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి ప్రత్యక్ష ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో, పశ్చిమగోదావరి జిల్లా తణుకు, తాడేపల్లిగూడెంలో పొర్లు దండాలు పెట్టి, కర్నూలులో క్లాప్ డ్రైవర్లు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. గూడూరులో దున్నపోతుకు వినతి పత్రం అందజేశారు. అనంతపురంలో ఓ కార్మికుడు అరగుండు గీయించుకున్నారు. కార్పొరేషన్ కార్యాలయం వద్ద కార్మికులు పొర్లు దండాలు పెట్టారు. విశాఖలోని మల్కాపురంలో చెత్త కుప్పల వద్ద బైఠాయించారు. మధురవాడలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. పిఎం.పాలెం, అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో పొర్లు దండాలు పెట్టి తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. బాపట్ల, ప్రకాశం జిల్లాలో వంటావార్పు చేపట్టారు. అనంతరం భిక్షాటన చేస్తూ సమ్మెకు ప్రజల మద్దతు కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. నెల్లూరులో పొర్లు దండాలు పెడుతూ జగన్‌కు మంచి బుద్ధిని ప్రసాదించాలని వేడుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ర్యాలీ, కాకినాడ జిల్లా గొల్లప్రోలులో పొర్లు దండాలు పెట్టారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో నిరసనలు కొనసాగాయి. శ్రీకాకుళంలో పొర్లు దండాలు పెడుతూ, ఆముదాలవలసలో ఉరి వేసుకుని, పలాసలో గాంధీ విగ్రహం వద్ద పడుకుని దండాలు పెడుతూ నిరసన తెలిపారు. విజయనగరం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట గడ్డితింటూ, రాజాంలో జగన్‌కు శతకోటి వందనాలు అంటూ కార్మికులు నిరసన తెలిపారు. నెల్లిమర్లలో పారిశుద్ధ్య పనులు చేసేందుకు అధికారులు నియమించిన సిబ్బందిని సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం, సాలూరు, పాలకొండలో పొర్లు దండాలు పెట్టారు. కడపలో గుండు కొట్టించుకుని, బద్వేలులో పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలియజేశారు. అన్నమయ్య, కృష్ణా జిల్లాల్లో నిరసనలు కొనసాగాయి. ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో జల దీక్ష చేపట్టారు.

వైసిపికి ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి గుడ్‌బై

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపికి మరో ఎమ్మెల్యే గుడ్‌బై చెప్పారు. ఇప్పటికే నెల్లూరు జిల్లా నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు, గుంటూరు జిల్లా నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు వైసిపిని వీడగా.. శుక్రవారం రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పార్టీని వీడుతున్నట్లు ప్రకటన చేశారు. రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసేందుకు తాడేపల్లి క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు.

సిఎం జగన్ వారిని కలవకుండా ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో సర్వేల ఆధారంగా మీకు టికెట్ ఇవ్వడం లేదని చెప్పించడంతో రామచంద్రారెడ్డి తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. క్యాంపు కార్యాలయం నుంచి బయటకు వచ్చి సిఎం నివాసానికి నమస్కారం చేస్తూ వైసిపిని వీడుతున్నట్లు ప్రకటన చేశారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. జగన్‌ను కలిసేందుకు అవకాశం ఇవ్వలేదన్నారు. టికెట్ ఇవ్వటం లేదని సజ్జలతో చెప్పారని అన్నారు. జగన్‌ను నమ్ముకుని కాంగ్రెస్ నుంచి వచ్చానని తెలిపారు. 2014, 2019లో పోటీ చేయనని చెప్పినా మంత్రి పదవి ఇస్తామని చెప్పి పోటీ చేయించారని అన్నారు. వైసిపి కోసం గడప గడపకూ తిరగడమే కాదు జగన్ చెప్పిన ప్రతి పని చేశామన్నారు. సర్వేల పేరుతో టికెట్ ఇవ్వలేమనడం బాధగా వుందన్నారు. కల్యాణదుర్గం నుంచి తను పోటీ చేయడంతోపాటు తన భార్య కూడా రాయదుర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తామని అన్నారు. వైసిపిలో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇవాళ్టి వరకు జగనే మా సర్వస్వం అనుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీవితాలు సర్వనాశనం అయ్యాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు ఇప్పటి వరకూ ఏ పార్టీ నుంచి పిలుపు రాలేదని, వస్తే పరిశీలిస్తానని తెలిపారు. పోటీ చేయడం మాత్రం జరుగుతుందన్నారు.

లడ్డు నాణ్యత లేదు..

- డయల్ యువర్ ఇఒలో ఫిర్యాదుల వెల్లువ

ప్రజాశక్తి - తిరుమల

లడ్డూలో చక్కెర శాతం ఎక్కువగా ఉందని, రుచి తగ్గిందని 'డయల్ యువర్ ఇఒ' కార్యక్రమంలో ఓ సందర్శకుడు ఫిర్యాదు చేశారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఇఒ కార్యక్రమంలో పలువురు సందర్శకులు అడిగిన ప్రశ్నలకు టిడిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి సమాధానాలిచ్చారు. ఫిర్యాదుల్లో సందర్శకులు మాట్లాడుతూ అన్నదాన సత్రంలో పరిశుభ్రతలేదని, వికలాంగులకు ప్రత్యేక క్యూలైన్ లేదని తెలిపారు. ఇఒ స్పందిస్తూ లడ్డు విషయంలో పోటు సిబ్బందికి సూచిస్తామని, నాణ్యమైన నెయ్యిని వినియోగిస్తున్నామని చెప్పారు. టీ దుకాణాల్లో మట్టిగ్లాసులు వినియోగించేలా అవగాహన కల్పిస్తామని, తిరుమలలో పరిశుభ్రతపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు.

శ్రీవారి సేవలో జాన్వీకపూర్

శ్రీదేవి కుమార్తె, సినీ నటులు జాన్వీ కపూర్, మహేశ్వరి తిరుమల శ్రీవారిని గురువారం సందర్శించారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిసెంబరు నెల వేతనాలు చెల్లించాలని విద్యుత్ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగారు. విద్యుత్ థర్మల్ ప్లాంట్లు, డిస్కం కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. విజయవాడలోని విద్యుత్ సౌదలోని ట్రాన్స్‌కో సిఎమ్‌డి కార్యాలయం బయట బైఠాయించి ఆందోళన చేపట్టారు. డిసెంబరు వేతనాలు చెల్లించాలని నినాదాలు చేశారు. అనంతరం సిఎమ్‌డి కె విజయానంద్‌కు వినతిపత్రం అందజేశారు. వేతనాలు సకాలంలో జమకాకపోవడంతో ఇఎంఐలు చెల్లించలేకపోతున్నామని తెలిపారు. కొత్త రుణాలు కూడా పొందలేకపోతున్నామని వివరించారు. సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సోమ, మంగళవారాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటామని వారికి విజయానంద్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్‌ఇబి ఇంజినీర్స్ అసోసియేషన్, ఎపిఎస్‌ఇబి ఎఇఇ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శులు పి ప్రతాప్ రెడ్డి, ఎస్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఓటుకు నోటు కేసును విచారించే ట్రయల్ కోర్టు పరిధిని సవాలు చేస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. న్యాయవాది-ఆన్-రికార్డ్‌లోని కుటుంబ సభ్యుని మరణం కారణంగా విచారణను వాయిదా వేయడానికి ధర్మాసనం అంగీకరించింది. ఈ పిటిషన్‌ను నాలుగు వారాల తరువాత విచారించనుంది.

ఒంగోలులో ఇద్దరికి కరోనా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులో ఇద్దరికి కరోనా నిర్ధారణైంది. ఒంగోలు నగరం, దేవుడుచెరువుకు చెందిన యువకుడికి, మద్దిపాడుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు చేసిన ఆర్‌టిపిఎస్‌ఆర్ టెస్టుల్లో కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. నమూనాలను జీనోమ్ ల్యాబ్‌కి పంపుతున్నామని అధికారు తెలిపారు.

బహిరంగ ప్రకటన
మహారాజశ్రీ నరసరావుపేట అదనపు సీనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో
ఐ.పి. నెం. 99/2023

బిట్వీన్
Sri Yalagala Sivayya & 5 others ... Petitioners / Creditors
Vs
Sri Kodali Dharma Rao & 2 others ..... Respondents

ఇందుమూలంగా యావన్మందికి ఈ పత్రికా ప్రకటన ద్వారా శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు తెలియజేయునది ఏమనగా పై నెంబరు ఐ.పి. నెం. 99/2023 నందు 1వ రెస్పాండెంటు అయిన శ్రీ కొడాలి ధర్మారావు గారిని దివాలాదారునిగా ప్రకటించమని మరియు వారి నుండి పిటీషన్ ఆస్తులను కొనుగోలు చేసిన రెస్పాండెంట్లు 2 మరియు 3 వారలు అయిన శ్రీమతి కూరపాటి పార్వతి మరియు శ్రీ ఆవుల చందు గారల దస్తావేజులు చెల్లవని తీర్మానించమని కోరుతూ పిటీషనర్లు అయిన క్రెడిటార్స్ (రుణదాతలు) పై ఐ.పి. నెం. 99/2023 దాఖలు చేసినందున ఇంకను ఎవరైనా 1వ రెస్పాండెంటుకు రుణములను ఇచ్చిన రుణదాతలు వున్నట్లయితే వారు స్వయంగా గానీ, వారి యొక్క అధీకృత న్యాయవాది ద్వారా కానీ ది.22-01-2024న ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి యెదుట హాజరై వారికి గల ఆక్షేపణలను తెలుపు నిమిత్తం లేదా వారిని కూడా పై ఐ.పి. నెం. 99/2023 నందు పార్టీలుగా చేర్చవలసినదిగా కోరు నిమిత్తం శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయటమైనది.
వాయిదా : 22-01-2024వ తేదీ అయివున్నది.

కావున మీరు పై ఐ.పి. నెం. 99/2023 వాయిదారోజు అనగా ది.22-01-2024న ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి యెదుట స్వయంగా గానీ, మీ తరపు లాయరుగారి ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలకు ఆధారభూతమైన కాగితములను ఆక్షేపణలను తెలుపుకోగలరు. లేనిచో ఇంకను రుణదాతలు ఎవరూ లేరని భావించి పై దివాలా పిటీషన్ తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.
వాయిదాతేది : 22-01-2024

ఇట్లు
కొడాలి నాగేశ్వరరావు,
వాది తరపు న్యాయవాది,
చిలకలూరిపేట.
ఫోన్ : 98481 69280

తెలంగాణలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కిడ్నాప్ కథ సుఖాంతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ, రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. కూకట్‌పల్లికి చెందిన సురేందర్‌బాబును శుక్రవారం సాయంత్రం కొందరు వ్యక్తులు అపహరించారు. బాధితుడి భార్యకు దుండగులు ఇంటర్నెట్ కాల్ చేసి రూ.50లక్షలు డిమాండ్ చేశారు. దీంతో కిడ్నాపర్ల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఫోన్ సిగ్నల్ ఆధారంగా శుక్రవారం ఉదయం సురేందర్‌బాబు పోలీసులకు అందుబాటులోకి వచ్చాడు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. కిడ్నాప్‌నకు ఆర్థిక లావాదేవీలే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు.

'హలాల్'పై యుపి సర్కారుకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లో హలాల్ సర్టిఫికెట్‌ను నిషేధించడంతోపాటు కేసు నమోదు చేయడంపై హలాల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని పేర్కొంది. గత ఏడాది నవంబర్‌లో, నకిలీ హలాల్ సర్టిఫికెట్లను పంపిణీ చేసినందుకు ఈ కంపెనీతోసహా అనేక సంస్థలపై ఉత్తర ప్రదేశ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆర్థికంగా లబ్ధి పొందేందుకు ప్రజల మతపరమైన మనోభావాలతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. హలాల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తనపై సుప్రీంకోర్టులో జరుగుతున్న క్రిమినల్ ప్రొసీడింగ్‌లను క్యాన్సిల్ చేయాలని కోరింది. యుపిలో హలాల్ సర్టిఫికేట్‌ను నిషేధించడంపై కోర్టు రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంతోపాటు ఎఫ్ఎస్ఎస్ఎఐ నుంచి సమాధానం కోరింది.

హిజ్బుల్ ఉగ్రవాది జావెద్ అహ్మద్‌కు ఏడు రోజుల పోలీస్ కస్టడీ

న్యూఢిల్లీ: హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాది జావెద్ అహ్మద్ మట్టుకు ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు ఏడు రోజుల పోలీస్ కస్టడీ విధించింది. శుక్రవారం ఉదయం ఢిల్లీ స్పెషల్ పోలీసులు జావేద్ అహ్మద్ మట్టును అరెస్ట్ చేశారు. అనంతరం పాటియాలా హౌస్ కోర్టులో ప్రవేశపెట్టగా, జావేద్ అహ్మద్‌కు ఏడు రోజులపాటు ఢిల్లీ ప్రత్యేక విభాగం పోలీసుల కస్టడీకి అప్పగించింది. జమ్ముకశ్మీర్‌లో పలు ఉగ్రవాద దాడుల వెనుక జావేద్ అహ్మద్ మట్టు హస్తం ఉందంటూ పలు కేసులు ఉన్నాయి.

ఇడి అధికారులపై టిఎంసి గూండాల దాడి

- పలువురికి గాయాలు
- వాహనాల ధ్వంసం

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో టిఎంసి గూండాలు మరోసారి రెచ్చిపోయారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని సందేశ్‌ఖాలీ గ్రామంలో ఒక పార్టీ నాయకుడి ఇంటి వద్దకు సోదాలకు వచ్చిన ఇడి అధికారులపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో పలువురు అధికారులకు గాయాలయ్యాయి. వాహనాలు ధ్వంసమయ్యాయి. పలువురు మీడియా ప్రతినిధులపై దాడి చేసి వారి కెమెరాలు, ఇతర సామాగ్రిని ధ్వంసం చేశారు. మీడియా ప్రతినిధుల వాహనంలో అధికారులు తప్పించుకోవడానికి ప్రయత్నించగా, అడ్డగించి గూండాలు దాడి చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలతో సందేశ్‌ఖాలీలో టిఎంసి నాయకుడు షాజహాన్ షేక్ ఇంటిపై సోదాలు జరపడానికి శుక్రవారం కేంద్ర బలగాలకు చెందిన కొంతమంది సిబ్బందితో కలిసి ఇడి అధికారులు రాగా, టిఎంసి గూండాలు అడ్డుకున్నారు. అయినా ఇడి అధికారులు షాజహాన్ షేక్ ఇంటిలోకి ప్రవేశించడానికి ప్రయత్నించగా, అధికారులపై దారుణంగా దాడికి దిగారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలు కేసులోనే గత ఏడాది రాష్ట్ర మంత్రి జ్యోతి ప్రియా మల్లిక్‌ను ఇడి అరెస్టు చేసింది. ఈ మంత్రికి సన్నిహితుడిగా షాజహాన్ షేక్‌కు పేరు ఉంది. రాష్ట్రంలో ఇడి అధికారులపై ఈవిధంగా దాడి జరగడం ఇదే మొదటిసారి.

దబోల్కర్ హత్య కేసులో బెయిల్‌పై పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ : హేతువాది నరేంద్ర దబోల్కర్ హత్య కేసులో నిందితుడికి బెయిల్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఆయన కుమార్తె వేసిన పిటీషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. 'ఈ పిటీషన్‌ను స్వీకరించడానికి మాకు ఎటు వంటి కారణం కనిపించడం లేదు' అని జస్టిస్ ఎంఎం సుందరేష్, ఎస్‌విఎస్ భట్టిలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడిన దబోల్కర్‌ను 2013 ఆగస్టు 20న పూణేలో మోటారుసైకిల్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు కాల్చి చంపారు. హంతకులను సచిన్ అండూరే, శరద్ కలస్కేర్‌గా గుర్తించిన సిబిఐ వారి అరెస్టు చేసింది. ఈ తరువాత కలస్కేర్ ఇచ్చిన సమాచారం ఆధారంగా ఈ హత్యకు సహకరించిన న్యాయవాది సంజీవ్ పులనేకర్‌ను, అతని సహాయకుడు విక్రమ్ భవేలను కూడా సిబిఐ అరెస్టు చేసింది. పులనేకర్‌కు 2019 జూన్‌లో పుణే కోర్టు బెయిల్ మంజూరు చేయగా, భవేకు బాంబే హైకోర్టు 2021మే 6న బెయిల్ మంజూరు చేసింది. భవేకు బెయిల్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ నరేంద్ర దభోల్కర్ కుమార్తె ముక్త దబోల్కర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఫిబ్రవరి 16న ఐక్య ఆందోళన

- రైతులు, కార్మికుల దేశవ్యాప్త ప్రదర్శనలు, పికెటింగ్‌లు, రైల్ రోకో, జైలు భరో
- కార్పొరేట్, మతోన్మాద విద్వేష, విభజన విధానాలపై ప్రతిఘటన
- ఎస్‌కెఎం, కేంద్ర కార్మిక సంఘాలు ఉమ్మడి వేదిక పిలుపు
- అన్ని వర్గాల మద్దతు కోరిన ఉమ్మడి వేదిక



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా రైతులు, కార్మికులు ఉమ్మడి ఆందోళనలు చేయనున్నారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా ప్రదర్శనలు, పికెటింగ్‌లు, రైల్ రోకో, జైలుభరో రూపంలో ఆందోళనకు భారీస్థాయిలో సమీకరించాలని రైతు, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), కేంద్ర కార్మిక సంఘాలు, సమాఖ్యలు ఉమ్మడి వేదిక సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 26న జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్, వాహన కవాతు కోసం ఎస్‌కెఎం పిలుపునకు మద్దతిచ్చింది. 'కార్పొరేట్, మతోన్మాద స్నేహంతో జరుగుతున్న విధ్వంసక, విభజన, అధికార విధానాలను ప్రతిఘటించడం, నిర్ణయాత్మకంగా ఓడించడం, వాటిని కార్మిక, రైతు, ప్రజా అనుకూల విధానాలతో భర్తీ చేయడం' లక్ష్యంగా ఈ ఆందోళన జరుగుతుంది. రైతు, కార్మిక ఉమ్మడి వేదిక ఆందోళనకు మద్దతు ఇవ్వాలని విద్యార్థులు, యువకులు, ఉపాధ్యాయులు, మహిళలు, సామాజిక ఉద్యమాలు, కళ, సంస్కృతి, సాహిత్య రంగాల్లోని అన్ని సమాన ఆలోచనలు గల ఉద్యమాలకు మేము విజ్ఞప్తి చేస్తున్నాము' అని పేర్కొంది. ఉద్యమ డిమాండ్లను ఆమోదించే వరకు ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేసింది. 'అన్ని పంటలకు మద్దతు ధర సి2ప్లస్50 శాతంతో పంటల సేకరణ హామీ, కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు రుణభారం నుండి విముక్తి కోసం చిన్న, మధ్య తరగతి వ్యవసాయ కుటుంబాలకు సమగ్ర రుణమాఫీ, నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించు కోవడం, ప్రాథమిక హక్కుగా ఉపాధి హామీ, రైల్వే, డిఫెన్స్, ఎలక్ట్రిసిటీ తదితరాలతో సహా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరించడం ఆపాలి' వంటి డిమాండ్లను పరిష్కరిం చాలి. 'ఉద్యోగాల కాంట్రాక్టీకరణ ఆపాలి, ఉపాధి హామీ కింద ప్రతి వ్యక్తికి రోజుకు రూ.600 వేతనంతో ఏడాదికి 200 రోజుల పని కల్పించాలి. పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలి. ఎల్ఎఆర్ఆర్ చట్టం 2013 అమలు చేయాలి' అని డిమాండ్ చేసింది.

'పాలక కార్పొరేట్, మతపరమైన అనుబంధం దేశాన్ని దోచుకుంటుంది. జాతీయ ఆస్తులు, ఫైనాన్స్‌లను కొన్ని ప్రైవేట్ కార్పొరేట్లకు అప్పగించడం, దేశ ప్రజాస్వామ్యంలోని అన్ని సంస్థలనూ స్తంభింపజేయడం, స్వాధీనం చేసుకోవడం చేస్తుంది' అని విమర్శించింది. 'ఈ ప్రభుత్వం మొత్తం శ్రమిస్తున్న ప్రజల జీవితాలు, జీవనోపాధిపై నిరంతరం అనాగరిక దాడులు కొనసాగిస్తోంది. వివిధ చట్టాలు, కార్యనిర్వాహక ఉత్తర్వులు, విధాన డ్రైవ్‌లో కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక చర్యలను దూకుడుగా కొనసాగిస్తోంది. ఇది రాజ్యాంగ విరుద్ధం.

ఎన్నుకోబడిన రాష్ట్ర ప్రభుత్వాల హక్కులు, ఇది వివిధ వర్గాల ప్రజల అన్ని ప్రజాస్వామ్య వాదనలను, అన్ని అసమ్మతి స్వరాలను అణిచివేస్తోంది. ఇది రాజకీయాలను, రాజ్యాంగ సంస్థలను వర్గీకరణ చేయడం, పరిపాలనా అధికారులను, కేంద్ర ఏజెన్సీలను పూర్తిగా దుర్వినియోగం చేయడమనే ప్రమాదకరమైన గేమ్ ప్లాన్‌తో కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వం మీడియా స్వేచ్ఛపై దాడి చేస్తుంది. బాధితులచే లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న నేరస్థులను రక్షిస్తుంది. దీంతో శాంతి భద్రతలపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది' అని పేర్కొంది.

మణిపూర్ హింసపై సిపిఎం అఫిడవిట్

- విచారణ కమిషన్‌కు అందచేత

న్యూఢిల్లీ : మణిపూర్‌లో మైతీ - కుకీ ఘర్షణలను కట్టడి చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం, ఇంటెలిజెన్స్ విభాగం వైఫల్యాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, సిపిఎం మణిపూర్ రాష్ట్ర కమిటీ మణిపూర్ హింసపై విచారణా కమిషన్‌కు ఒక అఫిడవిట్‌ను అందజేసింది. ఇండో - మయన్మార్ సరిహద్దుకు ప్రభుత్వం కంచె వేయాలన్న ఆకాంక్షను వ్యక్తం చేసింది. ఇంఫాల్ వెస్ట్ జిల్లా మేజిస్ట్రేట్ ద్వారా సిపిఎం మణిపూర్ కార్యదర్శి క్షేత్రిమయుమ్ శాంటా 37పేజీల ఈ అఫిడవిట్‌ను అందజేశారు. సుప్రీం కోర్టు ఆదేశాలను అనుసరించి విచారణా కమిషన్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం మణిపూర్ ప్రెస్ క్లబ్‌లో మీడియానుద్దేశించి క్షేత్రిమయుమ్ శాంటా మాట్లాడారు. మణిపూర్ హింసకు సంబంధించిన సంఘటనల సమాహారం, ఘర్షణకు గల కారణాలు, ఈ హింసకు బాధ్యులుగా ఎవరిని నిర్ధారించాలనే విషయాలను అఫిడవిట్‌లో పంచుకున్నట్లు తెలిపారు. శాంతి భద్రతలను అమలు చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిన కారణంగా ప్రజలు పడిన ఇబ్బందులను సిపిఎం ప్రముఖంగా ప్రస్తావించినట్లు శాంటా పేర్కొన్నారు. హింసను నియంత్రించడంలో ప్రభుత్వ యంత్రాంగం, ఇంటెలిజెన్స్ విఫలమయ్యాయన్న విషయాన్ని ముఖ్యమంత్రే స్వయంగా అంగీకరించారని శాంటా గుర్తు చేశారు. మణిపూర్ హింసపై వచ్చిన అనేక వార్తా కథనాలను కూడా అఫిడవిట్‌తో పాటూ అందజేసినట్లు తెలిపారు. వేలాదిమంది ప్రజలు నిర్వాసితులు కావడం, గ్రామాలపై దాడులు, 200మందికి పైగా మరణాలు, సున్నితమైన ప్రాంతాల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఇలా అన్నింటికీ సంబంధించిన వార్తలను అందజేసినట్లు తెలిపారు. లైలాంగ్ విషాదం నేపథ్యంలో మణిపూర్ లోయలో ఎఎఫ్ఎస్‌పిఎని తిరిగి విధించాలంటూ సిఎం ఎన్.బీరేన్ సింగ్ మాట్లాడడం చూస్తుంటే అది బెదిరింపుగా వుందని, ఖండించదగ్గ అంశమని శాంటా పేర్కొన్నారు. ప్రభుత్వం గనుక ముందస్తు చర్యలు తీసుకుని వుంటే అసలు మణిపూర్‌లో హింస చోటు చేసుకుని వుండేది కాదని అన్నారు. రాష్ట్రంలో సాధారణ పరిస్థితులను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

10 ప్రతిపక్ష పార్టీల ఖండన

రాష్ట్రంలో సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టాన్ని (ఎఎఫ్ఎస్‌పిఎ) తిరిగి విధించాలంటూ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ చేసిన వ్యాఖ్యలను పది ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. కాంగ్రెస్, ఆప్, ఎఐటిసి, ఎఐఎఫ్‌బి, ఎస్ఎస్(యుబిటి), సిపిఐ, సిపిఐ(ఎం), ఆర్ఎస్‌పి, ఎన్‌సిపి, జెడి(యు)లు ఈ మేరకు ఒక ప్రకటన చేశాయి.

జపాన్ ప్రధానికి మోడీ లేఖ

న్యూఢిల్లీ : జపాన్‌లో ఈ నెల 1న సంభవించిన ఘోరమైన భూకంప నేపథ్యంలో ఆ దేశ ప్రధానమంత్రి ఫ్యూనియో కిషిడాకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లేఖ రాసారు. జపాన్ ప్రజలకు భారత దేశం తరపున సంఘీభావం తెలియజేశారు. జపాన్‌కు అండగా ఉంటామని తెలిపారు. జపాన్‌తో సంబంధాలను భారత్ ఎల్లప్పుడూ విలువైనదిగా పరిగణిస్తుందని పేర్కొన్నారు. భూకంపం సమయంలో సాధ్యమైనంత సహకారాన్ని అందించడానికి భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు. 'జనవరి 1న జపాన్‌లో సంభవించిన భారీ భూకంపం గురించి తెలుసుకుని నేను చాలా బాధపడ్డాను, ఆందోళనకు గురయ్యాను' అని లేఖలో మోడీ తెలిపారు. జపాన్‌ను ఈ నెల 1న 7.6 తీవ్రతతోపాటు వరస భూకంపాలు వణికించాయి. శుక్రవారానికి ఈ భూకంపంలో మరణించిన వారి సంఖ్య 92కు పెరిగింది. మరో 242 మంది గల్లంతయ్యారు. సహాయక చర్యల్లో సమారు 4,600 మంది సిబ్బంది పాల్గొంటున్నారు.

ఇజ్రాయిల్ భీకర దాడులు

- జోర్డాన్‌లో పాలస్తీనా అనుకూల ప్రదర్శనలు
- లెబనాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు

గాజాలో ఇజ్రాయిల్ దాడులు ఆపాలని జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో నినాదాలు చేస్తున్న స్థానికులు



గాజా : గాజాలో ఇజ్రాయిల్ తన దాడులను మరింత ఉధృతం చేసింది. ప్రజలందరూ దక్షిణ ప్రాంతం నుండి వలస వెళ్లిపోయేలా శరణార్థుల శిబిరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు కొనసాగుతున్నాయి. డేర్ ఎల్ బాలా, నుస్రత్, అల్ మఘజి, బురెజి శరణార్థ శిబిరాలపై భారీగా బాంబు దాడులు జరిగాయి. ఖాన్ యూనిస్ నగరంలో 32మంది మరణించగా, రఫాలో ఐదుగురు చనిపోయారు. గత మూడు నెలల్లో చిన్నారులు మహిళలుసహా 22,600మంది మరణించగా, 58వేల మంది గాయపడ్డారు. ఇజ్రాయిల్ ట్యాంకులు ప్రజలను దారుణంగా చంపివేస్తున్నాయి.

తొలుత సెంట్రల్ గాజా సురక్షిత ప్రాంతమని ఇజ్రాయిల్ ఆర్మీ ప్రకటించింది గాజా నగరం, ఉత్తర ప్రాంతం నుండి సెంట్రల్ గాజాకు వెళ్లిపోవాల్సిందిగా కూడా ఆదేశించింది. ఇప్పుడు అక్కడ కూడా వైమానిక దాడులను భీకరంగా జరుపుతోంది. గురువారం నాటి పరిస్థితి దారుణంగా వుండడంతో మళ్లీ అక్కడ నుండి వలస వెళ్లిపోవడానికి ప్రజలు సిద్ధపడుతున్నారు. సెంట్రల్ గాజాలో భీకరంగా దాడులు కొనసాగుతున్నాయి. ఇజ్రాయిల్ మిలటరీ, సాయుధ వాహనాలు ఆ ప్రాంతంలోకి లోపలకంటా చొచ్చుకుపోతున్నాయి. శతఘ్నులు, వైమానిక దాడులతో పాటుగా, డ్రోన్‌లతో కూడా దాడులు జరుగుతున్నాయి. రఫాలో నెలకొన్న మానవతా సంక్షోభం అంతర్జాతీయ సమాజం, భద్రతా మండలి, ఇతర అంతర్జాతీయ సంస్థల్లో మిగిలివున్న విశ్వసనీయతకు పరీక్ష అని పాలస్తీనా విదేశాంగ శాఖ వ్యాఖ్యానించింది. సెంట్రల్ గాజాతో గాజా నగరాన్ని అనుసంధానిస్తున్న వంతెనపై ఇజ్రాయిల్ బలగాలు బాంబు దాడులు జరిపి, ధ్వంసం చేశాయి. దాడికి గురవుతున్న ప్రాంతాల నుండి ఖాళీ చేయాల్సిందిగా ఒక పక్క ప్రజలను కోరుతున్నారు. మరోపక్క మానవతా కారిడార్లుగా ఉపయోగిస్తున్న ఆ రోడ్లపైనే దాడులు చేసి వారిని చంపేస్తున్నారు.

లెబనాన్-ఇజ్రాయిల్ సరిహద్దుల్లో ఘర్షణలు

లెబనాన్-ఇజ్రాయిల్ సరిహద్దు 120 కిలోమీటర్ల పొడవునా ఘర్షణలు, దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. వరుసగా వైమానిక దాడులకు పాల్పడుతున్న ఇజ్రాయిల్, హిజ్బుల్లా మిలటరీ మౌలిక సదుపాయాలను, లాంచ్ సైట్‌లను ధ్వంసం చేయడమే తమ లక్ష్యమని చెబుతోంది. ఉత్తర ఇజ్రాయిల్‌లోని తమ ఇళ్లకు వెళ్లాలంటే వేలాదిమంది ఇజ్రాయిలీలకు ఇదొక్కటే మార్గం కావడంతో సరిహద్దు నుండి వైదొలగాల్సిందిగా హిజ్బుల్లా కార్యకర్తలను కోరుతోంది. గాజాపై ఇజ్రాయిల్ దాడులను ఆపితేనే సరిహద్దు వద్ద పరిస్థితుల గురించి తాము చర్చిస్తామని హిజ్బుల్లా తేల్చి చెబుతోంది.

అమ్మాన్‌లో భారీ ప్రదర్శనలు

పాలస్తీనియన్లకు మద్దతుగా జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో పెద్ద ఎత్తున ప్రదర్శనలు జరిగాయి. శుక్రవారం ప్రార్థనలు ముగిసిన వెంటనే ప్రదర్శన ప్రారంభమైంది. ఇజ్రాయిల్ తక్షణమే కాల్పుల విరమణ చేయాలని ప్రదర్శకులు నినదించారు.

మరో నౌక హైజాక్‌కు యత్నం

- తక్షణమే స్పందించిన భారత నేవీ
- 15 మంది భారతీయులతో సహా 21మంది సిబ్బంది సురక్షితం



న్యూఢిల్లీ : అరేబియా సముద్రంలో లైబీరియన్ జెండాతో కూడిన ఓడను హైజాక్ చేసేందుకు ప్రయత్నం జరిగిందన్న సమాచారం అందగానే భారత నావికాదళం సత్వరమే స్పందించింది. 15మంది భారతీయులతో సహా 21మంది సిబ్బందిని ఆ నౌక నుండి సురక్షితంగా కాపాడింది. ఈ మేరకు శుక్రవారం భారత నావికాదళం ఒక ప్రకటన జారీ చేసింది. హైజాక్ సమాచారం అందగానే ఐఎన్ఎస్ చెన్నైను దారి మళ్లించి ఆ ప్రాంతంలో మోహరించామని, సముద్ర జలాల గస్తీ విమానం శుక్రవారం ఉదయం ఆ నౌకలోని పరిస్థితులను పర్యవేక్షించిందని, నౌకలోని సిబ్బందితో కాంటాక్ట్‌ను ఏర్పరచుకుందని తెలిపింది. తర్వాత తమ మార్కొస్ కమాండోలు ఆ నౌకను అడ్డగించి అందరినీ రక్షించారని తెలిపింది. ప్రస్తుతం సిబ్బంది అంతా సురక్షితంగానే వున్నారని పేర్కొంది. భారత నావికాదళం సమర్ధవంతంగా కలగచేసుకోవడంతో హైజాక్ యత్నాన్ని వారు విరమించారని నేవీ ప్రకటన తెలిపింది. తిరిగి లైబీరియన్ నౌకలో విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించి, ప్రయాణం సాగేలా ఐఎన్ఎస్ చెన్నై చర్యలు తీసుకుంటోందని ఆ ప్రకటన తెలిపింది.

గురువారం సాయంత్రం గుర్తు తెలియని ఐదారుగురు సాయుధులు నౌకలోకి ఎక్కారంటూ లైబీరియన్ నౌక, యుకె మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ పోర్టల్‌కు సందేశం పంపిందని భారత నేవీ అంతకుముందు ఒక ప్రకటనలో తెలిపింది. ఐఎన్ చెన్నై అవసరమైన సాయాన్ని అందించడానికి నౌకకు సమీపంగా వెళుతోందని తెలిపింది. మొత్తంగా పరిస్థితి అంతా బాగానే వుందని, ఇతర సంస్థలు, బహుళ జాతి బలగాల సమన్వయంతో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు నేవీ తెలిపింది. ఈ నౌకలో భారతీయ సిబ్బంది కూడా వున్నారు. ప్రస్తుతం వీరందరూ నౌకలోని స్ట్రాంగ్ రూమ్‌లో కూర్చుని వున్నారు. వారితో కమ్యూనికేషన్ వుందని చెప్పారు. ఈ ప్రాంతంలో ఇది రెండో హైజాకింగ్ సంఘటన. గత నెల్లో మాల్టా వెళుతున్న నౌకను కూడా సోమాలియా సముద్ర దొంగలు ఇలాగే హైజాక్ చేశారు. ఈ సంఘటనల నేపథ్యంలో భారత నావికాదళం సెంట్రల్, ఉత్తర అరేబియా సముద్ర జలాల్లో సముద్ర జలాల గస్తీని పెంచింది. బలగాల సంఖ్యను కూడా పెంచింది.

తమిళులకు రాజకీయ స్వయంప్రతిపత్తి

- 13ఎ సవరణకు శ్రీలంక అధ్యక్షుడు మద్దతు

కొలంబో : రాజకీయ స్వయంప్రతిపత్తి కోసం తమిళులు దీర్ఘకాలంగా చేస్తున్న డిమాండ్‌ను పరిష్కరించేందుకు భారత్ ప్రతిపాదించిన 13వ సవరణకు శ్రీలంక అధ్యక్షుడు రానిల్ విక్రమసింఘె మద్దతిచ్చారు. 1987లో భారత్-శ్రీలంక ఒప్పందం తర్వాత ఈ 13వ సవరణను తీసుకువచ్చారు. దాన్ని అమలు చేయాలని భారత్, శ్రీలంకపై ఒత్తిడి తెస్తోంది. తమిళులకు అధికారాలను వికేంద్రీకరించాలని 13ఎ కోరుతోంది. జాఫ్నాలో ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ విక్రమసింఘె, అధికారాల వికేంద్రీకరణ కేవలం రాజకీయ భావనగా వుందని, అదొక ఆర్థికపరమైన వాస్తవికత అని అన్నారు. అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడం ద్వారా 1987లో శ్రీలంక రాజ్యాంగంలో 13ఎ భాగమైంది. తమ సాంప్రదాయ మాతృభూమిగా తమిళులు చెప్పుకునే ఉత్తర, ఈశాన్య ప్రాంతాలను తాత్కాలికంగా విలీనం చేయడంతో 9 ప్రావిన్స్‌లకు 9 ప్రావిన్షియల్ కౌన్సిళ్లను ఏర్పాటు చేశారు. 13వ సవరణ నిబంధనలను మనం పరిశీలించినట్లైతే, స్థానిక ఆర్థిక వ్యవస్థ ఏర్పాటు చేయడానికి మంచి అవకాశం వుంది. ఆ వ్యవహారాల్లో తాము జోక్యం చేసుకోకుండా, వాళ్లే చొరవ తీసుకునేలా ప్రోత్సహిస్తామని చెప్పారు.

బ్రిజ్‌భూషణ్ బెదిరింపులు నిజమే

- మౌనంగా ఉండకపోతే కెరీర్ నాశనం చేస్తామన్నారు
- మహిళా రెజ్లర్ల కేసులో ఢిల్లీ కోర్టుకు పోలీసుల వెల్లడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిజెపి ఎంపి, డబ్ల్యుఎఫ్ఐ మాజీ చీఫ్ బ్రిజ్ భూషణ్ సింగ్ మహిళా రెజ్లర్లను తీవ్రంగా బెదిరించారని, వారిని మౌనంగా ఉండాలంటూ హెచ్చరించారని ఢిల్లీ పోలీసులు పేర్కొన్నారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల కేసు విచారణ రోజ్ అవెన్యూ కోర్టులో గురువారం జరిగింది. 'మీరు రెజ్లింగ్‌లో కొనసాగదలుచుకుంటే మౌనంగా ఉండండి. మీ కెరీర్‌ను నేను ఎలాగైతే తీర్చిదిద్దగలనో.. దాన్ని నాశనం కూడా చేయగలనని మహిళా రెజ్లర్లను బ్రిజ్ భూషణ్ బెదిరించాడని ఢిల్లీ పోలీసుల తరపు న్యాయవాది అతుల్ శ్రీవాస్తవ కోర్టుకు తెలిపారు. అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ప్రియాంక రాజ్‌పుత్ ముందు ఢిల్లీ పోలీసులు ఈ వాదనలు వినిపించారు. బ్రిజ్ భూషణ్ బెదిరింపులు ఐపిసి సెక్షన్ 506 కింద నేర స్వభావాన్ని వెల్లడిస్తున్నాయని చెప్పారు. మరో మహిళా రెజ్లర్ ఫిర్యాదు స్టేట్‌మెంట్ ప్రకారం బ్రిజ్ భూషణ్ ఆమెను ఉద్దేశించి ఈ ధోతీ కుర్తా డ్రెస్‌లో నేను ఎలా కనిపిస్తున్నానని అడిగాడని తెలిపారు. బ్రిజ్ భూషణ్ ఒక రెజ్లర్‌ను కౌగిలించుకున్న సంఘటనను కూడా ప్రస్తావించారు. ఓ యువతిని ఇలా అడగవచ్చా? అని ఢిల్లీ పోలీసుల తరపు న్యాయవాది కోర్టును ప్రశ్నించారు. సహ నిందితుడు, డబ్ల్యుఎఫ్ఐ మాజీ అసిస్టెంట్ కార్యదర్శి వినోద్ తోమర్ కార్యాలయంలోకి మహిళలనే అనుమతిస్తారని, ఆపై తోమర్ కార్యాలయ తలుపులు మూసివేస్తారని శ్రీవాస్తవ తెలిపారు. పురుష రెజ్లర్లను లోపలికి రాకుండా అడ్డుకుంటారని, ఈ తీరు వారి ఉద్దేశాన్ని వెల్లడిస్తోందని కోర్టుకు వివరించారు.

'పృథ్వీ'కి రూ.4,797 కోట్లు

- ఇకపై అయోధ్యలో 'మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం'
- కేంద్ర మంత్రివర్గం ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2021-26 నుంచి ఐదేళ్లలో రూ.4,797 కోట్ల వ్యయంతో భూ శాస్త్రాలకు సంబంధించి కొనసాగుతున్న ఐదు ఉప-పథకాలతో కూడిన "పృథ్వీ విజ్ఞాన్"కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో కేంద్ర మంత్రివర్గ సమావేశం ఉప-పథకాలను కలుపుతూ భూ శాస్త్రాల మంత్రిత్వ శాఖ ప్రతిపాదనను ఆమోదించింది. అయోధ్య విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా ప్రకటించి దానికి "మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం, అయోధ్యధామ్" అని పేరు పెట్టే ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొదటి దశలో విమానాశ్రయం ఏటా 10 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించగలరు. రెండవ దశ తరువాత మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తుంది. రూ.1,450 కోట్ల కంటే ఎక్కువ వ్యయంతో అత్యాధునిక విమానాశ్రయం మొదటి దశ అభివృద్ధి చేయబడింది. విమానాశ్రయం టెర్మినల్ భవనం 6,500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంటుంది. టెర్మినల్ భవనం ముఖభాగం అయోధ్యలో రాబోయే శ్రీరామ మందిరం ఆలయ నిర్మాణాన్ని వర్ణిస్తుంది.

న్యూస్‌క్లిక్ కేసులో ఢిల్లీ పోలీసులకు, దర్యాప్తు సంస్థలకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ : దాడుల సందర్భంగా జర్నలిస్టుల వ్యక్తిగత డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్న సమయంలో పారదర్శకత లోపించిందని, అనుసరించాల్సిన ప్రక్రియ ఏదీ అనుసరించలేదని ఆన్‌లైన్ పోర్టల్ న్యూస్‌క్లిక్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు శుక్రవారం దర్యాప్తు సంస్థలకు, ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసింది. జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని బెంచ్ ముందు న్యూస్‌క్లిక్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తన వాదనలు వినిపిస్తూ, "చట్టపరంగా అనుసరించాల్సిన క్రమమేదీ పాటించలేదు. ఎలాంటి పత్రాలు ఇవ్వలేదు. ఏదీ జరగలేదు." అని చెప్పారు. గతేడాది అక్టోబరులో న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ నివాసం, కార్యాలయాలపై ఢిల్లీ పోలీసులు దాడి చేసి ఆయనను యుఎపిఎ కేసులో అరెస్టు చేశారు. పిటిషనర్ ఎందుకు నేరుగా సుప్రీం కోర్టునే ఆశ్రయించారని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. దానిపై సిబల్ స్పందిస్తూ, వ్యక్తిత డిజిటల్, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకోవడంపై మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతూ ఫౌండేషన్ ఆఫ్ మీడియా ప్రొఫెషనల్స్, ఐదుగురు విద్యావేత్తలు పెట్టుకున్న ఇటువంటి పిటిషన్లు ఇప్పటికే సుప్రీంకోర్టులో పెండింగ్‌లో వున్నాయని, అందుకే తాము కూడా సుప్రీంనే ఆశ్రయించామని చెప్పారు. వెంటనే కోర్టు, న్యూస్‌క్లిక్ కేసును కూడా ఆ పిటిషన్లతో కలిపివేసింది. విద్యావేత్తలు, మీడియా వ్యక్తులపై దాడులు జరిపిన సందర్భాల్లో వారి ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం చేసుకున్నప్పుడు వాటిల్లోని వ్యక్తిగత డేటాను సమగ్రతను కాపాడేందుకు సిబిఐ మాన్యువల్‌లోని ఆదేశాలకు కట్టుబడి వుండాలంటూ డిసెంబరు 14న మరో సుప్రీం బెంచ్ కేంద్రాన్ని ఆదేశించింది. కొత్త మార్గదర్శకాలు జారీ చేసేందుకు కసరత్తు జరుగుతోందని ఆ సమయంలో కేంద్రం తెలిపింది. ఇందుకు కనీసం మూడు మాసాలు పడుతుందని చెప్పింది. దాంతో ఆ పిటిషన్లపై విచారణను ఫిబ్రవరి 6కి వాయిదా వేసింది.

విజృంభిస్తున్న కరోనా

- 24 గంటల్లో 12 మంది మృతి
- 600 దాటిన జెఎన్.1 కేసులు
- కర్ణాటకలో అత్యధికం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా కరోనా విజృంభిస్తోంది. 24 గంటల వ్యవధిలో 761 కొత్త కేసులు బయటపడ్డాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ శుక్రవారం ఉదయం తెలిపింది. ఒక్కరోజే 12 మరణాలు నమోదయ్యాయి. కేరళలో ఐదుగురు, కర్ణాటకలో నలుగురు, మహారాష్ట్రలో ఇద్దరు, ఉత్తరప్రదేశ్‌లో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. వైరస్‌తో బాధపడుతున్న 838 మంది కోలుకున్నారు. ప్రస్తుతం దేశంలో 4,334 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి.

జెఎన్.1 ఉధృతి

కరోనా వైరస్ సబ్ వేరియంట్ జెఎన్.1 విజృంభిస్తోంది. కొత్త వేరియంట్ కేసులు తాజాగా 600 మార్కును దాటాయి. గురువారం వరకూ ఈ తరహా కేసులు దేశవ్యాప్తంగా 619కి పెరిగినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. 12 రాష్ట్రాల్లో జెఎన్.1 వైరస్ కేసులు బయటపడగా, కర్ణాటకలో అత్యధికంగా 199 కేసులు వెలుగుచూశాయి. కేరళలో 148, మహారాష్ట్రలో 110, ఢిల్లీలో 15, గోవాలో 47, గుజరాత్‌లో 36, ఆంధ్రప్రదేశ్‌లో 30, తమిళనాడులో 26, రాజస్థాన్‌లో నాలుగు, తెలంగాణలో రెండు, ఒడిశా, హర్యానాలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 619 కేసులు నమోదయ్యాయి. దీని వ్యాప్తి వేగంగా ఉన్నప్పటికీ.. ముప్పు తక్కువేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేసింది.


ఆ క్రైస్తవ నాయకులతో విభేదిస్తున్నాం

- ప్రధాని మోడీ క్రిస్మస్ లంచ్‌కు హాజరుకావటంపై 3,000 మంది క్రైస్తవుల సంతకాలు

న్యూఢిల్లీ: గతేడాది డిసెంబర్ 25న ప్రధాని మోడీ నిర్వహించిన క్రిస్మస్ లంచ్‌కు హాజరైన క్రైస్తవ నాయకులతో విభేదిస్తూ దేశవ్యాప్తంగా 3,000 మంది క్రైస్తవులు సంతకాలు చేశారు. ఈ మేరకు ప్రకటనను విడుదల చేశారు. కేంద్రంలో మోడీ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత 2014 నుంచి భారత్‌లోని క్రైస్తవులు అనేక సార్లు దాడులు, దూషణలకు గురవుతున్నారని తెలిపారు. పలు బిజెపి పాలిత రాష్ట్రాలలో అమలులో ఉన్న మత మార్పిడి నిరోధక చట్టాలు సమాజానికి వ్యతిరేకంగా, వివక్షాపూరిత సాధనంగా ఉపయోగించబడుతున్నాయని ప్రకటన పేర్కొన్నది. క్రిస్టియన్ సివిల్ సొసైటీ గ్రూపులు సేకరించిన డేటా ప్రకారం.. 2011 నుంచి 2022 మధ్య భారత్‌లో క్రైస్తవులపై దాడులు నాలుగు రెట్లు పెరిగాయి. అనేక సందర్భాల్లో పోలీసులు నేరస్థులపై కాకుండా హింసకు గురైన వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారని యునైటెడ్ క్రిస్టియన్ ఫోరమ్‌కి చెందిన మైఖేల్ తెలిపారు. "ప్రధానిగా ఎవరికైనా రిసెప్షన్‌ను నిర్వహించడం కచ్చితంగా ఆయన హక్కులో ఉన్నప్పటికీ.. ఆయన క్రైస్తవులపై ఒక్క దాడినీ ఖండించనప్పుడు సహజంగానే ఈ రిసెప్షన్ ఉద్దేశాన్ని ప్రశ్నిస్తారు. ఆయన ఏసుక్రీస్తును ప్రశంసిస్తూ, క్రైస్తవ సమాజం సేవల గురించి అనర్గళంగా మాట్లాడుతున్నప్పటికీ, ఈ రోజు దేశంలోని క్రైస్తవుల పరిస్థితిపై ఆయన పశ్చాత్తాపం చెందటం కానీ, సానుభూతిని పంచుకోవటం కానీ చేయలేదు" అని సదరు ప్రకటన పేర్కొన్నది. క్రిస్మస్ రిసెప్షన్‌కు ఆహ్వానించబడినవారు ఎంపిక చేసిన క్రైస్తవుల సమూహమని స్పష్టం చేసింది. ప్రధాని నుంచి ఆహ్వానం వచ్చినప్పుడు, మణిపూర్, ఇతర ప్రాంతాలలో క్రైస్తవులకు జరుగుతున్న అన్యాయాన్ని దృష్టిలో ఉంచుకొని వారు ఆ ఆహ్వానాన్ని మర్యాదపూర్వకంగా తిరస్కరించడానికి అవకాశం ఉన్నదని వివరించింది.




అంధుల లిపి పితామహుడు



పిల్లలూ, ఈ రోజు ఫ్రెంచ్ విద్యావేత్తగా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన అంధుల లిపి పితామహుడు లూయీ బ్రెయిలీ గురించి తెలుసుకుందామా!

పారిస్‌లో క్రూవే అనే గ్రామంలో మోనిక్ బ్రెయిలీ, సైమన్ రెనె బ్రెయిలీలకు 1809లో జనవరి 4న లూయీ జన్మించారు. మూడేళ్ల వయసులో ఉండగా, ఓ ప్రమాదంలో ఆయన రెండు కళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఏడాది వ్యవధిలో పూర్తిగా చూపు కోల్పోయారు. పారిస్‌లో వాలెంటైన్ హ్యూ ప్రారంభించిన అంధుల పాఠశాలలో ఆయన విద్యాభ్యాసం కొనసాగింది. అసాధారణ ప్రతిభతో రాణించిన ఆయన అప్పటికే అంధుల కోసం అమలులో ఉన్న 'లైన్ టైపు' పద్ధతిలో చదువుకుని 17 సంవత్సరాల వయస్సులోనే అదే స్కూలులో ప్రొఫెసరుగా నియమితులయ్యారు.



అంధులకు చదువు చెప్పాలంటే వారికి పుస్తకాలు కావాలి. కంటితో వారు చూడలేరు. స్పర్శ ద్వారా తప్ప మరో మార్గంలో చదువుకోలేరు. దీంతో ఎత్తుగా ఉబ్బివుండే విధంగా అక్షరాలు ఉన్న పుస్తకాలు కావాలి. చెక్కమీద, పుస్తకాల మీద ఎత్తుగా ఉబ్బివుండే అక్షరాలను రూపొందించేందుకు బ్రెయిలీ ఎంతో కృషి చేశారు.

అంతకుముందే చార్లెస్ బార్బియర్ అనే సైనికాధికారి, సైనికులు రాత్రిపూట సమాచారాన్ని తెలుసుకునేందుకు ఉపయోగించే 12 ఉబ్బెత్తు చుక్కల ప్రత్యేక లిపిని తయారుచేశారు. దీన్ని ఆధారంగా చేసుకుని బ్రెయిలీ తన నూతన పద్ధతిని సిద్ధాంతీకరించారు. ఐదేళ్ల పాటు పరిశోధన చేసి ఆరు చుక్కల లిపిని రూపొందించారు. ఆరు పాయింట్లు వివిధ రకాలుగా వాడి మొత్తం 26 ఇంగ్లీషు అక్షరాలు పలికేటట్లు చేశారు. మొత్తం భాషకు 250 గుర్తులు రూపొందించారు. ఈ లిపినే ప్రపంచదేశాలు ఉపయోగిస్తున్నాయి. బ్రెయిలీ లిపి కుడి నుంచి ఎడమకు రాస్తారు. బ్రెయిలీలో టైపురైటర్లు కూడా రూపొందించారు. అంధులకు వెలుగు చూపించిన బ్రెయిలీ 1852లో క్షయ వ్యాధికి గురై జనవరి 6న మరణించారు. తన పరిశోధన ద్వారా విప్లవాత్మకమైన మార్పు సాధించి నవయుగ వైతాళికుడయ్యారు బ్రెయిలీ.

నేను గీసిన బొమ్మ





ఎం.మాధవి,
7వ తరగతి, జెడ్‌పిహెచ్
కుల్చారం, మెదక్‌జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

రాజ్యాంగ విలువలను కాపాడాలి

- ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు



'బాలలకోసం భారత రాజ్యాంగ ప్రవేశిక'

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

దేశంలో ప్రజాస్వామ్యం, మానవ హక్కులు సురక్షితంగా ఉండాలంటే చిన్నతనం నుంచే రాజ్యాంగం, రాజ్యాంగ విలువల పట్ల అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్సీ, విద్యావేత్త కెఎస్ లక్ష్మణరావు అన్నారు. విజిఎస్ వారు ప్రచురించిన 'బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక' పుస్తకాన్ని ఆయన విజయవాడ పుస్తక మహోత్సవం తొమ్మిదోరోజు శుక్రవారం కేతు విశ్వనాథ రెడ్డి సాహిత్య వేదికపై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగానికి పునాదిలాంటి రాజ్యాంగ పీఠికను పిల్లలకు అర్థమయ్యేలా చేసేందుకు ఈ పుస్తకాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. సభలో ముఖ్య అతిథి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థులకు సామాజిక శాస్త్రాల పరిచయం అనివార్యమన్నారు. యువతలో సామాజిక శాస్త్రాల అధ్యయనం తగ్గిపోవడం వల్ల సమాజంలో మూఢత్వం పెరిగి, రాజ్యాంగ విలువలకు ప్రమాదం ఏర్పడుతోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సామాజిక శాస్త్రాల పుస్తకాలతోపాటు, రాజ్యాంగ విలువలను తెలుసుకోవాలని సూచించారు. కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు మాల్యాద్రి, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న తదితరులు ప్రసంగించారు.

సరియైన ఉచ్చారణే భాషకు ప్రాణం

సరైన ఉచ్చారణే ఏ భాషకైనా ప్రాణం పోస్తుందని, తెలుగుభాషలో చేస్తున్న ఉచ్చారణా దోషాలను తెలుసుకుని సరిచేసుకోవాలని మైనారిటీ సంక్షేమశాఖ కమిషనర్ ఎఎమ్‌డి ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై సత్తి లలితారెడ్డి రచించిన 'సరియైన ఉచ్చారణ' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. పాణ్యం దత్తశర్మ పుస్తకంలో విశేషాలను వివరించారు. సత్తి సునీల్, డాక్టర్ జెట్టి ఎలమంద సభలో పాల్గొన్నారు. గోళ్ల నారాయణరావు సభకు అధ్యక్షత వహించారు.

ఈ సారి నాకు టిక్కెట్టు లేదు

- ఫేస్‌బుక్‌లో కేశినేని నాని

ప్రజాశక్తి- విజయవాడ

తెలుగుదేశం పార్టీ ఈసారి తనకు టిక్కెట్టు ఇవ్వడం లేదని, లోక్‌సభకు తన స్థానంలో వేరొకరిని బరిలోకి దింపుతున్నారని విజయవాడ ఎంపి కేశినేని నాని తెలిపారు. ఫేస్‌బుక్ వేదికగా శుక్రవారం ఈ విషయాన్ని ఆయన వెల్లడించారు. ' అందరికీ నమస్కారం. గురువారం సాయంత్రం చంద్రబాబు ఆదేశాల మేరకు మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం రఘురాం. మాజీ ఎంపి కొనకళ్ల నారాయణ నన్ను కలిశారు. ఈ నెల 7న తిరువూరులో జరిగే సభకు వేరేవారిని ఇన్‌ఛార్జిగా నియమించారని చెప్పారు. ఆ విషయంలో ఇక జోక్యం చేసుకోవద్దన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో విజయవాడ లోక్‌సభ స్థానానికి అభ్యర్థిగా నా స్థానంలో వేరొకరికి అవకాశం ఇవ్వాలని అనుకుంటున్నారని, పార్టీ వ్యవహారాల్లో ఎక్కువగా జోక్యం చేసుకోవద్దని చంద్రబాబు ఆదేశించారని చెప్పారు. అధినేత ఆజ్ఞలను తూ.చా తప్పకుండా పాటిస్తానని నేను వారికి చెప్పా' అని పేస్‌బుక్‌లో ఆయన చేసిన వ్యాఖ్య కలకలం రేపింది పెద్ద సంఖ్యలో నాని అభిమానులు ఆయన కార్యాలయానికి చేరుకున్నారు. నానికి మద్దతుగా నినాదాలు చేశారు. మరోవైపు తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన నాని ప్రజల ఆశీస్సులతో మూడోసారి కూడా తానే విజయవాడ ఎంపి అవుతానని చెప్పారు. మీడియా వేసిన పలు ప్రశ్నలకు సమాధానమిస్తూ... కాలమే నిర్ణయిస్తుందన్నారు. ఇప్పటికీ తాను టిడిపిలోనే ఉన్నానని చెప్పారు. తమ పార్టీ అధినేత చంద్రబాబు అని గతంలోనే తాను చెప్పానని, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసైనా గెలుపొందుతాననే ధీమా తనకుందని అన్నారు. తనను నమ్ముకున్న అభిమానులతో చర్చించిన తరువాత భవిష్యత్తుపై నిర్ణయం తీసుకుంటానని చెప్పారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- పథకాన్ని నీరుగారుస్తున్న ప్రభుత్వాలు
- ధర్నాలో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మధ్యాహ్న భోజన పథకంలోని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ధర్నాలో వక్తలు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించి వచ్చేవారి సంఖ్యను పెంచేందుకు ఉన్న ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయని విమర్శించారు. పథకంలో పనిచేస్తున్నవారిని ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రతి నెల 5లోపు వేతనాలు చెల్లించాలని, పెండింగ్ వేతనాలు, బిల్లులు చెల్లించాలని, 12 నెలల వేతనాలివ్వాలని, మెనూ ఛార్జీలు రూ.20లకు పెంచాలని, బడ్జెట్ పెంచాలని తదితర డిమాండ్లతో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన విజయవాడలోని ధర్నా చౌక్‌లో శుక్రవారం ధర్నా జరిగింది. యూనియన్ అధ్యక్షులు జి వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి మాట్లాడుతూ.. డ్వాక్రా మహిళలు అనేక కష్ట నష్టాలు భరిస్తూ ఈ పథకాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. వీరి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మహిళలందరూ తన అక్కచెల్లెమ్మలు అంటూనే ముఖ్యమంత్రి ఈ పథకంలో పనిచేసే వారిని మర్చిపోయారని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాట తప్పారని పేర్కొన్నారు. హామీని అమలు చేయాలని శాంతి యుతంగా ధర్నాకు బయలుదేరిన కార్మికులను జిల్లాల్లో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లలో పెట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి మాట్లాడుతూ.. 23 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం పట్టించు కోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వంట సమయంలో ప్రమాదానికి గురైన వారికి నష్టపరిహారం చెల్లించాలని, పాఠశాలల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్స్ ఏర్పాటు చేయాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించొద్దని, మౌలిక సదుపాయాలు కల్పించి రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దూరి, నాగమణి, శివ కుమారి, కార్యదర్శులు కల్పన, నాగమణి, లీలావతి, సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


కఫం సమస్య పోవాలంటే ...

చలికాలం చాలామందికి దగ్గు, జలుబు సమస్యలతో పాటు ఛాతీలో కఫం పేరుకుపోతుంది. ఈ సమస్య వల్ల కొన్నిసార్లు శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది. రాత్రిపూట ప్రశాంతంగా నిద్రపోలేరు. ఇదిలాగే కొనసాగితే దీర్ఘకాలిక ఇన్ఫెక్షన్ న్యుమోనియాకి దారి తీస్తుంది. ఇంట్లో దొరికే కొన్ని పదార్థాలతో కషాయం తయారుచేసుకుని ఈ బాధ నుంచి ఉపశమనం పొందవచ్చు.

ఏవేం కావాలంటే.. : అంగుళం అల్లం ముక్క, 8-10 ఎండుమిర్చి, 8-10 తులసి ఆకులు, ఒక పచ్చి పసుపు కొమ్ము, ఒక దాల్చిన చెక్క, ఒక పెద్ద బెల్లం ముక్క, ఒక గ్లాసు నీరు.

తయారీ విధానం : మట్టి కుండలో నీటిని పోసి మరిగించుకోవాలి. అందులో తులసి ఆకులు, ఎండుమిర్చి, పచ్చి పసుపు వేసి కలపాలి. ఆ తరువాత దాల్చిన చెక్క, బెల్లం, అల్లం వేసి ఇంకాసేపు మరిగించుకోవాలి. పోసిన నీరు సగమయ్యే వరకు సుమారు 20 నిమిషాల పాటు మరిగించుకోవాలి. దాదాపు సగం గ్లాసు అయిన తర్వాత, వడకట్టుకుని వేడి, వేడిగా ఉన్నప్పుడే తాగాలి. ఇలా 3-4 రోజులు తాగితే జలుబు, దగ్గు సమస్యతో పాటు కఫం నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది. ఇందులో పచ్చి పసుపును ఉపయోగించడం వల్ల కఫం వదులుతుంది. అలాగే ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఇన్ఫెక్షన్లతో పోరాడుతాయి. ఎండుమిర్చి తింటే జలుబు, కఫం తగ్గుతాయి. డికాక్షన్ తయారీలో ఉపయోగించే పదార్థాలన్నీ నిర్ణీత పరిమాణంలో మాత్రమే కలపాలి. ఎక్కువ జోడించడం వల్ల గుండెల్లో మంట, వికారం, అన్నవాహికలో చికాకు వస్తుంది.

రంగవల్లి





ఉషారాణి,
కర్నూల్.

19 చుక్కలు
9 వరుసలు 9 వచ్చేవరకు

ముగ్గులు పంపవల్సిన మా చిరునామా :
మెయిల్ ఐడి : jeevanapageps@ gmail.com
వాట్సాప్ : 83329 25496

టిటాస్ దెబ్బకు ఆసీస్ ఢమాల్

- తొలి టి20లో తొమ్మిది వికెట్ల తేడాతో భారత్ గెలుపు



టిటాస్
4-0-17-4

ముంబయి: నవీ ముంబయిలోని డివైపాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో ఆస్ట్రేలియా మహిళలతో జరిగిన తొలి టి20 భారత మహిళలజట్టు ఘన విజయం సాధించింది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 142పరుగుల లక్ష్యాన్ని భారత్ 17.4ఓవర్లలో స్మృతి మంధాన(54)వికెట్ కోల్పోయి ఛేదించింది. తొలి వికెట్‌కు స్మృతి మంధాన-షెఫాలీ వర్మ కలిసి 137పరుగులతో విజయతీరాలకు చేర్చారు. మంధాన(54; 52బంతుల్లో 7ఫోర్లు, సిక్సర్), షెఫాలీ వర్మ(64నాటౌట్; 44బంతుల్లో 6ఫోర్లు, 3సిక్సర్లు) ధాటిగా ఆడారు. వీరిద్దరూ కలిసి 15.2ఓవర్లలోనే 137పరుగులు చేశారు. ఆసీస్ బౌలర్ వారేహామ్‌కు ఒక వికెట్ లభించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ టిటాస్ సద్ధుకు లభించింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాను పేసర్ టిటాస్ సద్ధు కట్టడి చేసింది. సద్ధుకి తోడు స్పిన్నర్లు శ్రేయాంక, దీప్తి కూడా రాణించడంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 141పరుగులకు ఆలౌట్ చేసింది. భారత బౌలర్లు రాణించడంతో 33పరుగులకు 4వికెట్లు పడగొట్టి పట్టు బిగించేలా కనిపించినా.. ఆసీస్ యువ బ్యాటర్ లిచ్‌ఫీల్డ్(49; 32బంతుల్లో 4ఫోర్లు, 3సిక్సర్లు), ఎలీసా పెర్రి(37; 30బంతుల్లో 2ఫోర్లు, 2 సిక్సర్లు) ఆదుకున్నారు. వీరిద్దరూ కలిసి 5వ వికెట్‌కు 79పరుగులు జతచేశారు. ఆ దశలో లిచ్‌ఫీల్డ్‌ను అమన్‌జ్యోత్ కౌర్ ఔట్ చేయడం, పెర్రీని దీప్తి ఔట్ చేయడంతో మ్యాచ్ స్వరూపం ఒక్కసారిగా మారిపోయింది. లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ వెంట వెంటనే ఔటయ్యారు. టిటాస్ సద్ధుకు నాలుగు, శ్రేయాంక, దీప్తికి రెండేసి, రేణుక సింగ్, అమన్ జ్యోత్ కౌర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. దీంతో మూడు టి20ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యతలో ఉండగా.. రెండో టి20 ఆదివారం జరగనుంది.

స్కోర్‌బోర్డు..

ఆస్ట్రేలియా మహిళల ఇన్నింగ్స్: హీలీ (సి)హర్మన్‌ప్రీత్ (బి)రేణుకా సింగ్ 8, మూనీ (సి)హర్మన్‌ప్రీత్ (బి)టిటాస్ సద్ధు 17, తహిలా మెక్‌గ్రాత్ (సి)పూజ వస్త్రాకర్ (బి)టిటాస్ సద్ధు 0, ఎలీసా ఫెర్రి (సి)అమన్‌జ్యోత్ కౌర్ (బి)దీప్తి శర్మ 37, గార్డినర్ (సి అండ్ బి)టిటాస్ సద్ధు 0, లిచ్‌ఫీల్డ్ (సి)హర్మన్‌ప్రీత్ (బి)అమన్‌జ్యోత్ కౌర్ 49, గ్రేస్ హ్యారిస్ (ఎల్‌బి)శ్రేయాంక 1, సథర్లాండ్ (సి)హర్మన్‌ప్రీత్ (బి)టిటాస్ సద్ధు 12, వారేహామ్ (సి)అమన్‌జ్యోత్ (బి)శ్రేయాంక 5, మేగన్ స్కట్ (ఎల్‌బి)దీప్తి 1, బ్రౌన్ (నాటౌట్) 0, అదనం 11. (19.2ఓవర్లలో ఆలౌట్) 141పరుగులు. **వికెట్ల పతనం:** 1/28, 2/32, 3/32, 4/33, 5/112, 6/119, 7/135, 8/135, 9/137, 10/141 **బౌలింగ్:** రేణుక సింగ్ 4-0-24-1, పూజ వస్త్రాకర్ 2-0-28-0, టిటాస్ సద్ధు 4-0-17-4, శ్రేయాంక 3.2-0-19-2, దీప్తి శర్మ 4-0-24-2, అమన్‌జ్యోత్ 2-0-23-1.

భారత మహిళల ఇన్నింగ్స్: స్మృతి మంధాన (సి)మెక్‌గ్రాత్ (బి)వారేహామ్ 54, షెఫాలీ వర్మ (నాటౌట్) 64, జెమిమా రోడ్రిగ్స్ (నాటౌట్) 6, అదనం 21. (17.4 వికెట్ నష్టానికి) 145పరుగులు. **వికెట్ల పతనం:** 1/137 **బౌలింగ్:** బ్రౌన్ 2-0-10-0, స్కట్ 3-0-24-0, సథర్లాండ్స్ 2-0-21-0, గార్డినర్ 4-0-24-0, మెక్‌గ్రాత్ 2-0-31-0, వారేహామ్ 3.4-0-20-1.

ఒకే గ్రూప్‌లో భారత్, పాకిస్తాన్

- జూన్ 9న ఇరుజట్ల మధ్య గ్రూప్ లీగ్ మ్యాచ్
- టి20 ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల



దుబాయ్: టి20 ప్రపంచకప్ 2024 షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్‌మండలి(ఐసిసి) శుక్రవారం విడుదల చేసింది. జూన్ 1 నుంచి టి20 ప్రపంచకప్ మెగా టోర్నీ ప్రారంభమవుతుందని ఐసిసి అధికారిక ప్రకటన చేసింది. ఆతిథ్య అమెరికాతో కెనడా జట్ల మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో ప్రారంభం కానుంది. 'గ్రూప్ ఏ'లో ఉన్న భారత్-పాక్ జట్లు న్యూయార్క్ వేదికగా జూన్ 9న తలపడనున్నాయి. అమెరికా, వెస్టిండీస్ సంయుక్తంగా 2024 టి20 ప్రపంచకప్‌కు ఆతిథ్యమిస్తోన్న సంగతి తెలిసిందే. ఈసారి మొత్తం 20జట్లు టైటిల్‌కు తలపడతున్నాయి. అమెరికాలోని(3) సెయింట్ లూసియా, ఆర్నొస్ వాలే, సెయింట్ విన్సెంట్ స్టేడియాల్లో.. వెస్టిండీస్‌లోని(6) కింగ్‌టన్, బార్బొడాస్, బ్రియాన్ లారా, ట్రినిడాడ్, ప్రొవిడెన్స్, గయానా, వివియన్ రిచర్డ్, ఆంటిగ్వా, డారెన్ సమీ క్రికెట్ మైదానాల్లో వేదికల్లో మొత్తం 55 మ్యాచ్‌లు జరగనున్నాయి. జూన్ 1 నుంచి 18వరకు గ్రూప్ లీగ్, 19నుంచి 24వరకు సూపర్-8, 26, 27న సెమీఫైనల్, 29న బార్బొడాస్‌లో ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

గ్రూప్-ఏ : భారత్, పాకిస్తాన్, ఐర్లాండ్, అమెరికా, కెనడా,
గ్రూప్-బి : ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, నమీబియా, స్కాట్లాండ్, ఓమన్
గ్రూప్-సి : న్యూజిలాండ్, ఆఫ్ఘనిస్తాన్, ఉగాండా, పపువాన్యూయేనియా
గ్రూప్-డి : దక్షిణాఫ్రికా, శ్రీలంక, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, నేపాల్

షెడ్యూల్..

జూన్ 5 : భారత్ × ఐర్లాండ్(న్యూయార్క్) జూన్ 9 : భారత్ × పాకిస్తాన్(న్యూయార్క్)
జూన్ 12 : భారత్ × అమెరికా(న్యూయార్క్) జూన్ 15 : భారత్ × కెనడా(ఫ్లోరిడా)

మజుందార్ సెంచరీ

ఆంధ్ర-బెంగాల్ రంజీమ్యాచ్

ప్రజాశక్తి - పిఎం.పాలెం (విశాఖపట్నం)

ఆంధ్ర-బెంగాల్ జట్ల మధ్య విశాఖలోని ఎసిఎ-విడిసిఎ స్టేడియంలో శుక్రవారంనుంచి రంజీ మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన బెంగాల్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 86ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 289 పరుగులు చేసింది. ఓపెనర్ సౌరవ్ పాల్(96) తృటిలో సెంచరీ మిస్ చేసుకోగా.. అనుష్టుప్ మజుందార్(125) సెంచరీతో రాణించాడు. శ్రేయాన్స్ ఘోష్(11), సుదీప్ కుమార్ గార్మి(18) త్వరగా అవుటైనా మిడిల్ ఆర్డర్‌లో మజుందార్-సౌరవ్ 3 వికెట్‌కు 189పరుగులు జతచేసి బెంగాల్‌ను ఆదుకున్నారు. ఆట నిలిచే సమయానికి బెంగాల్ క్రీడా శాఖ మంత్రి మనోజ్ తివారి(15), మహమ్మద్ కైఫ్(0) క్రీజ్‌లో ఉన్నారు. ఆంధ్ర జట్టు బౌలర్లలో ఎ.లలిత్ మోహన్‌కు రెండు, సోయబ్ మహమ్మద్ ఖాన్‌కు ఒక వికెట్ దక్కాయి.

12ఏళ్లకే రంజీల్లో అరంగేట్రం...

12 ఏళ్ల 284 రోజుల వయసులో రంజీల్లో అరంగేట్రం చేసి బీహార్ యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ రికార్డు నెలకొల్పాడు. శుక్రవారం ముంబయితో ప్రారంభమైన రంజీమ్యాచ్‌లో బీహార్ తరపున బరిలోకి దిగిన వైభవ్.. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన నాల్గో అతి పిన్నవయస్కుడైన భారతీయుడిగా రికార్డు నెలకొల్పాడు. అంతకుముందు ఈ రికార్డు అలీముద్దీన్ 1942-43లో రాజ్‌పుటానా తరపున 12ఏళ్ల 73 రోజుల వయసులో తొలిసారి ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడాడు. తొలిరోజు ముంబయి ఆట ముగిసే సమయానికి 9వికెట్ల నష్టానికి 235 పరుగులు చేసింది.

ఫొటో : టివి రమణ



ఆందోళనలో పాల్గొన్న ఉద్యోగిని ఎత్తిపడేస్తున్న పోలీసులు



విజయవాడలో ధర్నా చేస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

కదం తొక్కిన ఎస్ఎస్ఎ ఉద్యోగులు

- డైరెక్టరు కార్యాలయం ముట్టడి.. పలువురి అరెస్ట్
- చర్చలకు డైరెక్టర్ హామీ
- తొలగింపు ఉత్తర్వులు వెనక్కి తీసుకోవడానికి అంగీకారం



పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐవి ని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



సిఐటియు నాయకులు ఎవి నాగేశ్వరరావును అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ సమస్యలు పరిష్కారం కోసం సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కదం తొక్కారు. 16 రోజుల నుంచి విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతోపాటు తొలగింపులకు కూడా సిద్ధం కావడంతో జిల్లాల నుండి వేలాది మంది ఉద్యోగులు శుక్రవారం విజయవాడకు తరలివచ్చారు. సమగ్ర శిక్షా డైరెక్టరు కార్యాలయాన్ని ముట్టడించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన వీరిని పోలీసులు నిలువరించలేకపోయారు. నాయకులను డైరెక్టరు వద్దకు రాయబారం తీసుకువెళ్ళి మాట్లాడించారు. అంతకుముందు వేలాది మంది ఉద్యోగులు విజయవాడలోని పటమట రైతు బజార్ వద్దనున్న డైరెక్టరు కార్యాలయం వద్దకు తరలివచ్చారు. వీరిని అడ్డుకునేందుకు పోలీసులు అన్ని వైపులా బారికేడ్లు పెట్టి భారీ ఎత్తులో మోహరించారు. రైతు బజార్ వైపు కొంతమంది, ఆటోనగర్‌వైపు కొంతమంది ఉద్యోగులు పోలీసుల కళ్లు గప్పి డైరెక్టరు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. రెండువైపులా మోహరించిన పోలీసులు వీరిని అటువైపు వెళ్లకుండా దొరికిన వారిని దొరికినట్లు బలవంతంగా అరెస్టులకు పూనుకున్నారు. పోలీసుల అరెస్టులతో ఆటోనగర్ వైపు వెళ్లే రోడ్డు, రైతు బజార్ రోడ్డు రణరంగంగా మారింది. ఎపి సమగ్ర శిక్షా కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్షులు బి కాంతారావుతోపాటు పలువురు నాయకులను పోలీసులు ముందుగా అరెస్టు చేశారు. ఉద్యోగులకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావును పోలీసులు అరెస్టు చేశారు. సుమారు మూడు గంటల పాటు పోలీసులు సమగ్ర శిక్షా డైరెక్టరు కార్యాలయ ప్రాంతాన్ని ఉద్యోగుల అరెస్టుతో రణరంగంగా మార్చారు. ఈ అరెస్టులు తరువాత కూడా వందల సంఖ్యలో ఉద్యోగులు తరలివచ్చి ఆందోళనకు దిగారు.దీంతో సమగ్ర శిక్షా డైరెక్టరు బి శ్రీనివాసరావు వద్దకు ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరావు, ఫెడరేషన్ నాయకులను రాయబారం తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఒగ్యులరైజ్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, హెచ్‌ఆర్‌ఎ, డిఎతో మినిమం టైం స్కేల్ రూ.26 వేలు చెల్లించాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, రూ.10 లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలని తదితర డిమాండ్లను నాయకులు ప్రస్తావించారు. ఉద్యోగుల డిమాండ్ల పట్ల సానుకూలంగా ఉన్నామని నాయకులతో డైరెక్టరు చెప్పారు. మంత్రితో మాట్లాడి చర్చలకు ఆహ్వానిస్తామని తెలిపారు. ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేసి బెదిరించేలా తొలగింపు ఉత్తర్వులు ఇవ్వడం సరికాదని ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావుతో పాటు ఇతర నాయకులు ప్రస్తావించగా తొలగింపు ఉత్తర్వులను వెనక్కి తీసుకుంటామని డైరెక్టర్ హామీ ఇచ్చారు. దీంతో ముట్టడి కార్యక్రమాన్ని విరమించుకున్నారు. సమ్మె మాత్రం కొనసాగుతుందని తెలిపారు.

అరెస్టులను ఖండించిన పిడిఎఫ్

సమగ్ర శిక్షా ఉద్యోగుల అరెస్టులను పిడిఎఫ్ ఖండించింది. ఈ మేరకు శాసనమండలి పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ కెఎస్ లక్ష్మణరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీర్ఘకాలికంగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం గానీ, సమగ్ర శిక్షా డైరెక్టర్ బి శ్రీనివాసరావు గానీ ఉద్యోగులతో చర్చించకుండా తొలగిస్తామని బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డైరెక్టర్ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఉద్యోగులు డైరెక్టరు కార్యాలయం వద్ద ధర్నా చేసేందుకు ప్రయత్నిస్తే ముందే పోలీసులతో దౌర్జన్యపూరితంగా అరెస్టులు చేశారని అన్నారు. ఉద్యమాన్ని అణచివేసే ప్రయత్నం చేశారని, దీనిని ఖండిస్తున్నామని వెల్లడించారు. వెంటనే ఉద్యోగులతో చర్చలు జరిపి వారి డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులు ప్రధానంగా డిమాండ్ చేస్తున్న హెచ్‌ఆర్ పాలసీ, ఎంటిఎస్, సమాన పనికి సమాన వేతనం అంశాలపై చర్చించాలని డిమాండ్ చేశారు.

పలువురికి గాయాలు

పోలీసుల అరెస్టులతో ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావుతో పాటు పలువురికి గాయాలయ్యాయి. ఎవి నాగేశ్వరరావుకు చేతివేలు విరిగింది. విజయనగరం జిల్లా మెరకముడిదాం మండల కేంద్రంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న పైడిరాజుకు కాలు విరిగింది. ప్రస్తుతం వీరిద్దరూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరితోపాటు మరికొంతమందికి గాయాలయ్యాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68